జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

https://prajapalana.com/epaper.php




సంపుటి 16 సంచిక 105 విశాఖపట్నం | శుక్రవారం 08 డిసెంబరు 2023 | 8 పేజీలు | వెల : 5.00

## దుర్గమ్మ ఆలయ అభివృద్ధి పనులకు..

# జగన్ శంకుస్థాపన

### రూ.216 కోట్ల రూపాయల అంచనాతో అభివృద్ధి

### కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం జగన్



ఎన్టీఆర్ జిల్లా: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయ వాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, పలు ఆలయాల ప్రారంభోత్సవం సందర్భంగా ఇవాళ ఇంద్రకీలాద్రికి వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డికి ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు, పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించగా, మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని అందజేయగా.. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్వీకరించారు. దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఈవో కెఎస్ రామారావు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు కనకదుర్గనగర్ వద్ద ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. రూ.216 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అలాగే పలు ఆలయాలను పునర్నిర్మాణం చేసిన సందర్భంగా వాటిని ప్రారంభించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఇంద్రకీలాద్రిపై గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య సహకారం పరిఢవిల్లాలి..

# రేవంత్, భట్టికి జగన్ శుభాకాంక్షలు

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారు. జూబ్లిహిల్స్ పెద్దమ్మతల్లి గుడిలో కుటుంబసమేతంగా ప్రత్యేక పూజల అనంతరం ఎల్బీ స్టేడియానికి వచ్చిన రేవంత్‌తో.. అతిరథ మహారథుల మధ్య గవర్నర్ తమిళిసై సీఎంగా ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పెద్దలంతా తరలివచ్చారు. సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేలతో పాటు.. కర్నాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు.. ఓపెన్ టాప్ జీప్‌లో సోనియాతో కలిసి కార్యకర్తలకు అభివాదం చేస్తూ వచ్చారు రేవంత్. ప్రమాణం అనంతరం.. తన కుటుంబాన్ని



సోనియాకు పరిచయం చేశారు రేవంత్. దంపతులిద్దరూ ఆమె పాదాలకు నమస్కరించారు. ఎల్బీస్టేడియంలో గ్రాండ్‌గా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి.. రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చాయి. దీంతో స్టేడియం లోపల, బయటా జనంతో కిక్కిరిసిపోయింది. ఆ చుట్టుపక్కలంతా సందడి వాతావరణం ఏర్పడింది. నేతలు, కార్యకర్తలు ఆనందంతో డ్యాన్సులు చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం.. రేవంత్ రెడ్డి అగ్రనేతల్ని స్వయంగా వీడ్కోలు పలికారు. కాగా.. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి అభినందనలు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు శుభాకాంక్షలు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు.

### నేటి నుంచి వరద ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన



అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు . రేపటి నుంచి రెండు రోజుల పాటు మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్య టించనున్నారు. ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో ఆయన పర్యటించబోతున్నారు. నేడు పొన్నూరు, వేమూరు, తెనాలి, బాపట్ల నియోజకవర్గాల్లో పర్యటనకు వెళ్లబోతున్నారు. నేడురాత్రికి బాపట్లలోనే టీడీపీ అధినేత బస చేయనున్నారు. శనివారం పర్చూరు, పత్తిపాడు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటన కొనసాగనుంది.

# కులగణన మళ్లీ వాయిదా..



అమరావతి, డిసెంబర్ 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర కులగణన ప్రక్రియ మరోసారి వాయిదా వేసింది. ముందుగా నవంబర్ 27వ తేదీ నుంచి కులగణన ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పూర్తిగా డిజిటల్ విధానంలో ప్రక్రియ చేపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక యాప్ ద్వారా డోర్ టు డోర్ సర్వే చేపట్టాలని ప్రభుత్వం గైడ్ లైన్స్ కూడా జారీ చేసింది. కులగణన ఎలా చేపట్టాలి? ఇంటింటికీ వెళ్ళినప్పుడు ఎలాంటి ప్రశ్నలు అడగాలి? వంటి అంశాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్ల ఆధ్వర్యంలో కులగణన జరిగేలా అంతా సిద్ధం చేశారు. మరోవైపు కుల సంఘాల, నిపుణులతో జిల్లా వారీగాను, ప్రాంతీయ సమావేశాలు కూడా నిర్వహించారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, కర్నూల్, తిరుపతిలో ప్రాంతీయ సమావేశాలు పూర్తయ్యాయి. మరోవైపు పైలెట్ ప్రాజెక్టుగా ఐదు సచివాలయాల పరిధిలో సర్వే కూడా విజయవంతంగా పూర్తి చేశారు. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ప్రభుత్వం కులగణన వాయిదా వేసింది. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత చివరి నిమిషంలో కులగణన ప్రక్రియ డిసెంబర్ 9కి వాయిదా వేస్తున్నట్లు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ ప్రకటించారు. దీనికి కారణాలు కూడా చెప్పుకొచ్చారు. కుల సంఘాలు, నిపుణులతో ప్రాంతీయ, జిల్లాస్థాయి సమావేశాల్లో అనేక అభిప్రాయాలు తీసుకున్నామని, మరింత పక్కాగా చేపట్టేలా మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ఈ సమావేశాల ద్వారా వచ్చే అభిప్రాయాల మేరకు సర్వే చేస్తామని చెప్పారు. ఈ నెల 9 నుంచి ప్రారంభం కావాల్సిన సర్వేను తాజాగా మరోసారి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కొత్త తేదీ మాత్రం ఎప్పుడనేది చెప్పలేదు. **(మిగతా 2లో..)**

## ఏపీ, తమిళనాడుకు రెండో ఇన్‌స్టాల్మెంట్ నిధులు రిలీజ్: అమిత్ షా



న్యూఢిల్లీ: మిగ్‌జాం తుఫాన్ వల్ల తమిళనాడు, ఏపీలో వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ఆ రెండు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో నష్టం జరిగింది. పంట పొలాల్లోకి నీరు చేరడంతో నష్టం భారీగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఎస్డీఆర్ఎఫ్ నిధులను రెండు రాష్ట్రాలకు విడుదల చేయాలని కేంద్ర హోంశాఖను ప్రధాని మోదీ ఆదేశించినట్లు ఇవాళ కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. ఆయన తన ట్విట్టర్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎస్డీఆర్ఎఫ్ నిధుల్లో ఏపీకి 493 కోట్లు, ఏపీలో 450 కోట్లు రిలీజ్ చేయనున్నట్లు ఆయన తన ట్వీట్‌లో చెప్పారు. అయితే రెండు రాష్ట్రాలకే ఇప్పటికే తొలి ఇన్‌స్టాల్మెంట్‌ను రిలీజ్ చేసినట్లు వెల్లడించారు. గడిచిన 8 ఏండ్లలో చెన్నైలో వరదలు రావడం ఇది మూడవసారి. అధిక వర్షాల వల్ల మెట్రో నగరాల్లో ఆకస్మికంగా వరదలు వస్తున్నాయని అమిత్ షా అన్నారు.

## బీజేపీ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం




ఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో బీజేపీ అధికారం కైవసం చేసుకుంది. ఈ ఉత్సాహంతో ఇవాళ ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఆయన సమావేశ మందిరానికి రాగానే పార్టీ ఎంపీలు “మోదీ జీ కా స్వాగ్ హై” అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పూలమాలతో స్వాగతం పలికారు.రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్ లలో ముఖ్యమంత్రుల ఎంపికపై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీజేపీ తొలిసారిగా సమావేశం నిర్వహించింది. సభ 4వ రోజు ప్రారంభానికి ముందు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని బాలయోగి ఆడిటోరియంలో ఈ సమావేశం జరిగింది.రాబోయే 5 ఏళ్లలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ని ఢీ కొట్టే సమర్థవంతమైన నేతని ముఖ్యమంత్రిగా ఆమోదించడం బీజేపీ ముందున్న కీలకమైన పని. 2024 లోక్ సభ ఎన్నికలకు సమాయత్తమవుతన్న కాంగ్రెస్ పార్టీకి 3 రాష్ట్రాల్లో ప్రతికూల ఫలితాలు రావడం కాస్తంత నిరాశకలిగించింది. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ ను ఓడించి కాంగ్రెస్ అధికారం చేపట్టింది

# కృష్ణమ్మకు కొనసాగుతున్న వరద పోటు

### ప్రకాశం బ్యారేజీకి 30 వేల క్యూసెక్కుల వరద నీరు

### గేట్లు ఎత్తి దిగివకు విడుదల చేసిన అధికారులు



ఎన్టీఆర్ జిల్లా: కృష్ణా నదికి వరద ప్రవాహం భారీగా వచ్చి చేరుతుంది. గడిచిన కొన్ని రోజులుగా కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో పడుతున్న భారీ వర్షాలకు నదిలోనికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. దీనికి తోడు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.ఈ వరద నిరంత ప్రస్తుతం కృష్ణా నదిలోకి చేరడంతో నీటి ప్రవాహం రోజు,రోజుకి, గంట, గంటకు పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద 30 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. నీటి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టన్ని ఉంచుతూ, బ్యారేజీ 72 గేట్లలోని 40 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి, మిగులు జలాలను కిందికి విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం 7 గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో 30 వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో లో కూడా 30 వేల క్యూసెక్కులుగా ఉంది. వరద నీటిని దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



# నెల్లూరు జిల్లాలో దారుణం



నెల్లూరు: జిల్లాలో దారుణం... వరద ముంపు ప్రాంతాల్లో కనీసం తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. సహాయక చర్యలు చేపట్టడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైసీపీ శ్రేణులే ఆందోళనలకు దిగారు. నగరంలోని 12వ డివిజన్‌లో తాగునీటి కోసం స్వయానా మేయర్ భర్త జయవర్ధన్ ఆందోళనకు దిగడంతో.. ఇక తామెవ్వరికి చెప్పుకోవాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు.కాగా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పేదూరు, నరుకూరు, చింతోపు గ్రామాల్లో మండల సీపీఎం నేత వేగూరి వెంకయ్య ఆధ్వర్యంలో నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. పంట పొలాల్లో పర్యటించి తుఫాన్ కారణంగా నీట మునిగిన పొలాల్లో దిగి, ఎంతమేరకు నష్టం జరిగిందో రైతులనడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.తుఫాన్ తాకిడికి నష్టపోయిన నిమ్మ రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ నిమ్మ రైతులను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ విషయమై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. నాలుగు రోజులుగా పార్లపల్లి, చెర్లోపల్లి, బ్రాహ్మణపల్లి, అయ్యగారిపాలెం, చెన్నారెడ్డిపల్లి గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

# యువతరం కోసమే నా పోరాటం..

**ఎన్నికల గురించి ఎప్పుడూ ఆలోచించను**



విశాఖపట్నం :ఏఎస్ రాజా గ్రౌండ్‌లో జనసేన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వైసీపీ సర్కారుపై విమర్శలు గుప్పించారు. 151 సీట్లతో వైసీపీని గెలిపించినా ఇప్పటి వరకూ ఒక్కటీ సరైనా ఉద్యోగం ఇవ్వలేదని, నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాటం.. అన్ని జిల్లాలను ఏకం చేసిందని, విశాఖ ఉక్కు అంశం భావోద్వేగంతో కూడినది అని పవన్ అన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర పెద్దలకు చెప్పానని, విశాఖ ఉక్కుపై తన అభిప్రాయాన్ని అమిత్ షా గౌరవించారని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ప్రయత్నం చేయగలిగామన్నారు. యువత కోసమే తన ఆలోచన అంతా అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు."ఏపీలో టీడీపీ-జనసేన ప్రభుత్వానిదే అధికారం. 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోతారు. మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణను అభివృద్ధి చేసిన కేసీఆరే ఓడిపోయారు." అని నాగబాబు అన్నారు.

# జగన్ చొరవతో ఇంద్రకీలాద్రి దశ మారేనా..?



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: అభివృద్ధికోసం నిధులు ఖర్చు చేస్తున్నారు సరే.. తిరుమలలో ఉన్నట్టు పగడ్బందీ వ్యవస్థను ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దర్శనాలు, క్యూలైన్లు, పారిశుధ్య నిర్వహణ విషయంలో కూడా తీవ్ర విమర్శలున్నాయి. ఏపీలో తరచూ వార్తల్లోకెక్కే ఆలయం బెజవాడ కనకదుర్గమ్మ దేవస్థానం. కొండ చరియలు విరిగిపడ్డాయని, నకిలీ టికెట్లతో దర్శనాలు జరుగుతున్నాయని, అమ్మవారి చీరలు అక్రమంగా అమ్ముకుంటున్నారని, భవానీ భక్తులు ఇబ్బంది పడుతున్నారని.. ఇలా రకరకాలుగా ఈ ఆలయం చుట్టూ వివాదాలు ముసురుతూనే ఉంటాయి. టీడీపీ హయాంలో ఏకంగా క్షుద్రపూజల కలకలం రేగింది. ప్రభుత్వాలు మారినా దుర్గగుడి వ్యవహారంలో పెద్దగా అభివృద్ధి కార్యక్రమాలేవీ జరగలేదనే విమర్శ కూడా ఉంది. వీటన్నిటికీ సీఎం జగన్ ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. దుర్గగుడిపై రూ. 216 కోట్లతో చేపట్టబోతున్న అభివృద్ధి పనులకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. రూ. 57 కోట్లతో అన్నప్రసాద భవన నిర్మాణం ఇక్కడ మొదలవుతుంది. రూ.27కోట్లతో ప్రసాదం పోటు భవనం కూడా నిర్మించబోతున్నారు. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, మెట్లు, దక్షిణంవైపు అదనపు క్యూ కాంప్లెక్స్, మహారాజ ద్వార నిర్మాణం, మల్లికార్జున మహా మండపం వద్ద క్యూ కాంప్లెక్స్ మార్పు, నూతన కేశఖండన శాల, గోశాల విస్తరణ వంటి కార్యక్రమాలకు ఈరోజు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఇంద్రకీలాద్రి కొండ రక్షణ పనులు, ప్యానల్ బోర్డుల ఏర్పాటు, వాటర్ మేనేజ్‌మెంట్ పనులు పూర్తి కాగా వాటిని సీఎం జగన్ ప్రారంభించారు.అభివృద్ధికోసం నిధులు ఖర్చు చేస్తున్నారు సరే.. తిరుమలలో ఉన్నట్టు పగడ్బందీ వ్యవస్థను ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. పవిత్ర కృష్ణానది తీరంలో వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిని పర్యాటకంగా మరింతగా అభివృద్ధి చేసే అవకాశముంది. వివిధ పనులకోసం బెజవాడకు వచ్చినవారు కచ్చితంగా ఆలయానికి రావాలనుకుంటారు. కానీ ఇక్కడికి వస్తే మాత్రం అసంతృప్తితోనే వెనుదిరుగుతారు. పుష్కరాల సమయంలో మాత్రమే ఘాట్ లు సుందరంగా మారతాయి, ఆ తర్వాత వాటిని పట్టించుకునేవారు ఉండరు. దర్శనాలు, క్యూలైన్లు, పారిశుధ్య నిర్వహణ విషయంలో కూడా తీవ్ర విమర్శలున్నాయి. వీటన్నిటినీ సరిచేయడానికి సీఎం జగన్ చేస్తున్న ప్రయత్నం సఫలమవుతుందేమో చూడాలి.

# అన్నదాతలకు అండగా నిలిచేందుకు వస్తున్న చంద్రన్న

**టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

**ఈ నెల 8,9 తేదీలలో బాపట్ల పార్లమెంట్ పరిధిలో పర్యటన**

**8న బాపట్ల నియోజకవర్గం, 9న పర్చూరు నియోజకవర్గంలో పంటల పరిశీలన**

**తుఫాన్ బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం**



పర్చూరు, డిసెంబర్ 07, ప్రజాపాలన : తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగానికి, అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తుందని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు,పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ తో కలిసి, గురువారం నీటమునిగిన పంటలను పరిశీలించిన అనంతరం, బాపట్ల తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అన్నదాతను వైసీపీ ప్రభుత్వం నిరాదరణకు గురి చేస్తుందన్నారు. రైతు కంట కన్నీరు రాష్ట్రాని కి అరిష్టమన్నారు. రైతాంగానికి ధైర్యం కల్పించాల్సిన ప్రభుత్వం, రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. రైతాంగానికి అండగా నిలిచేందు కు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రెండు రోజులపాటు, బాపట్ల పార్లమెంటు పరిధిలో పర్యటిస్తారని ఆయన తెలిపారు. ఈనెల 8వ తేదీన బాపట్ల నియోజకవర్గ పరిధిలో, 9వ తేదీన పర్చూరు నియోజకవర్గ పరిధిలో, తుఫాను ప్రభావంతో నీట మునిగిన పంటలను పరిశీలించి, రైతుకు భరోసా ఇవ్వనున్నారన్నారు.అన్నదాతలను ఇబ్బందులకు గురి చేసిన, ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మెల్యే ఏలూరి హెచ్చరించారు.

# తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు ఏకరానికి రూ. 20వేలు నష్టపరిహారం ఇవ్వాలి : బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ



గుడివాడ : తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం చాలా బాధాకరమాని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి రైతులకు ఎకరానికి 20 వేలు నష్ట పరిహారాన్ని అందచేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం నందివాడ మండలంలోని జనార్ధనపురంలో మునిగిపోయిన పంటా పోలాలను బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం చాలా బాధాకంమన్నారు. వెంటనే ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులకు ఎకరానికి 20 వేలు, తడిసిన ధాన్యానకి మద్దతు ధరకు కోనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, నాయకులు సూరే గాంధీ, రాంప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కులగణన మళ్లీ వాయిదా..

(మొదటి పేజీ తరువాయి)

రెండోసారి వాయిదాకు కారణం ఇదే

వాస్తవంగా నవంబర్ 27 వ తేదీ నుంచి కులగణన ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అది కాస్తా డిసెంబర్ 9 వ తేదీకి వాయిదా పడింది. తాజాగా మరోసారి సర్వే ను వాయిదా వేసింది సర్కార్. దేశంలో బీహార్ తర్వాత ఆంధ్రప్రదేశ్ మాత్రమే కులగణన చేయాలని నిర్ణయించింది. దీనికోసం ఆరుగురు అధికారుల కమిటీని నియమించింది..కమిటీ బీహార్ లో పర్యటించి అక్కడ కులగణన జరిగిన విధానంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. కమిటీ నివేదిక ఆధారంగా కేబినెట్ కూడా కులగణన చేపట్టేందుకు ఆమోద ముద్ర వేసింది. కేబినెట్ నిర్ణయం తర్వాత ప్రక్రియను వేగవంతం చేసింది. మిచౌంగ్ తుఫాన్ కారణంగా కులగణన వాయిదా వేశామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాల్ చెప్పారు. తుఫాన్ కారణంగా జరిగిన పంటనష్టం పై అధికార యంత్రాంగం నిమగ్నమై ఉందని, ఈ సమయంలో తుపాన్ నష్టం, రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి వేణుగోపాల్ అన్నారు. కేవలం తుఫాన్ కారణంగానే వాయిదా వేశాం తప్ప వేరే కారణాలు లేవన్నారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు కుదుటపడిన తర్వాత త్వరలో కులగణన తేదీని ప్రకటిస్తామన్నారు. సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి కావడంతో ఆలస్యంగా ప్రక్రియ ప్రారంభించినా వారం రోజుల్లోగా పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతుంది.

# సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ నేత రామకృష్ణ శుభాకాంక్షలు

ప.గో: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి సీపీఐ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... ఇది శుభపరిణామం, తెలంగాణాలో కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేశాయి. మా అభ్యర్థి కూనంనేని సాంబశివరావు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ప్రభుత్వం రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాల మధ్య సామరస్య వాతావరణం ఉండేటట్లు చూడాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం విభజన బిల్లులోని హామీలు అమలు చేయకుండా తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు అన్యాయం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి రేవంత్‌రెడ్డి ముందుకు రావాలి" అని రామకృష్ణ కోరారు.

# ప్రభుత్వానికి పంటనష్టం నివేదిక

## 28 మండలాల్లో సర్వే పూర్తి.. 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.20 కోట్ల నష్టం

## మూడు మండలాలకు మొండిచేయి



అనంతపురం అర్బన, డిసెంబరు 7: ఖరీఫ్ కరువు నివేదికను జిల్లా యంత్రాంగం బుధవారం ప్రభుత్వానికి పంపింది. జిల్లాలో 31 మండలాలు ఉండగా, 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం నెల రోజుల క్రితం ప్రకటించింది. క్షేత్ర స్థాయిలో పంటనష్టం వివరాలు సేకరించి పంపాలని ఆదేశించింది. ఈ-క్రాపింగ్ ఆధారంగా పంటనష్టం వివరాలను వ్యవసాయ అధికారులు సేకరించారు. ఆర్బీకేల్లో సామాజిక తనిఖీ కోసం జాబితాను ప్రదర్శించారు. అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది నివేదికను తయారు చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో 33 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించారు. చిన్న, సన్నకారు, పెద్ద రైతులకు గరిష్ఠంగా ఐదెకరాల దాకా పంటనష్టం అంచనాలు తయారు చేశారు. జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.20 కోట్ల పంటనష్టం జరిగినట్లు నిర్ధానించారు. మండల, డివిజన స్థాయి కమిటీల ద్వారా జిల్లా కమిటీకి తుది జాబితాను పంపించామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి పంటనష్టం నివేదికలను పంపించామని తెలిపారు.

ఆ మూడింటికి మొండిచేయి

యల్లనూరు, బెళుగుప్ప, బొమ్మనహాల్ మండలాలను కరువు జాబితాలో చేర్చలేదు. మిగతా మండలాల్లో తరహాలోనే ఆయా మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తమ ప్రాంతాల్లోను వర్షాభావంతో పంటనష్టం జరిగిందని, కరువు మండలాలుగా ప్రకటించాలని రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ప్రభుత్వం నుంచి తదుపరి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో 28 మండలాల్లోనే పంటనష్టంపై సర్వే చేశారు.

# వాటాల్లో తేడా.. బయటపడిన దొంగలు



కంబదూరు(కళ్యాణదుర్గం), డిసెంబరు 7: ఓ వ్యవసాయ తోటలో చోరీకి పాల్పడిన నలుగురు దొంగల మధ్య వాటాల పంపకంలో తేడాలు వచ్చాయి. అందులో ఒక దొంగ బయటకు వచ్చి అసలు వాస్తవాలను బాధిత రైతుకు వివరించాడు. దీంతో చివరకు దొంగతనం కాస్తా బయటపడింది. వివరాల్లోకి వెళితే.... కంబదూరు మండల పరిధిలోని కే రాంపురం గ్రామంలో రైతు మహేష్ వ్యవసాయ తోటలో అక్టోబరు 29న దొంగలు చోరీకి పాల్పడ్డారు. వ్యవసాయ తోటలో వున్న డ్రిప్ పైపులు, 14 స్ప్రింక్లర్ గన్‌లను చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ. 70 వేల వరకు వుంటుందని తెలుస్తోంది. బాధిత రైతు మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యం నిమిత్తం తమిళనాడుకు వెళ్లిన సమయంలో దొంగలు ఈ చోరీకి పాల్పడినట్టు తెలుస్తోంది. రైతు మహేష్ స్వగ్రామానికి వచ్చిన తరువాత తోటలోకి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు అర్థమైంది. దీనిపై అతడు గ్రామంలోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లో పూర్తిగా విచారణ చేపట్టాడు. అయినా క్లూ చిక్కలేదు. చివరకు ఆయన తోటలో చోరీకి పాల్పడిన నలుగురు దొంగలకు వాటాల్లో తేడా రావడంతో ఒక దొంగ చోరీ చేసినట్టు మహేష్ వద్దకు వచ్చి ఒప్పుకున్నాడు. అంతేకాకుండా దొంగతనానికి పాల్పడిన నలుగురు దొంగల పేర్లు, వారి చిరునామాల విషయం కూడా ఆయనకు తెలియజేశాడు. ఇంకేముంది, దొంగల వివరాలు తెలియడంతో నవంబరు 27న కంబదూరు పోలీసు స్టేషన్‌లో వారిపై రైతు మహేష్ ఫిర్యాదు చేశాడు. అయితే దొంగలను పట్టుకోవాల్సిన పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వుంటూ తనపైనే విరుచుకుపడుతున్నారని రైతు మహేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీంతో విసుగు చెంది స్వయంగా మంగళవారం రోజున జగనన్నకు చెబుదాంకు ఫోన్ చేసి చోరీ సంఘటనపై ఫిర్యాదు చేశానన్నారు. అంతటితో ఆగకుండా బుధవారం జిల్లా ఎస్పీకి తన ఆవేదనను, చోరీ సంఘటనను తెలియజేశానన్నాడు. తానే స్వయంగా దొంగలను పట్టించి తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నా తనకు ఏ మాత్రం న్యాయం జరగలేదని కన్నీటితో ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# పైడివాడఅగ్రహారంలో జగనన్న కాలనీలో ప్లాట్ల మధ్యనుంచి వరద నీటి ప్రవాహం

**పునాదుల కింద నుంచి నీటి ప్రవాహం**

**వీఎంఆర్‌డీఏ, గృహ నిర్మాణ సంస్థ అధికారుల నిర్లక్ష్యమే కారణం**



విశాఖపట్నం/సబ్బవరం, డిసెంబరు 7 :సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం జగనన్న కాలనీలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. వర్షం పడితే కాలనీ ముంపునకు గురవుతూనే ఉంది. గడిచిన రెండు రోజుల నుంచి భారీవర్షాలు కురుస్తుండడంతో వరద నీరు ఇళ్ల పునాదుల మీదుగా ప్రవహిస్తోంది. ప్రవాహ ఉధృతికి నాసిరకంగా నిర్మించిన నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. కొండకు ఆనుకుని అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో పది వేల ఇళ్ల నిర్మాణాలకు 2022 ఏప్రిల్ 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే లేఅవుట్ కోసం అధికారులు అక్కడ సహజసిద్ధంగా ఉండే వాగులను పూడ్చేశారు. కొండ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని మళ్లించాలనే విషయాన్ని లేఅవుట్ రూపొందించిన వీఎంఆర్‌డీఏ, గృహ నిర్మాణ సంస్థ అధికారులు విస్మరించారు. దీంతో గత ఏడాదిన్నరగా భారీవర్షం కురిసినప్పుడల్లా కాలనీని వరద ముంచెత్తుతోంది. ఈ ఏడాది మే నెలలో ఇదే పరిస్థితి తలెత్తినప్పుడు వరద మళ్లింపునకు ప్రత్యేకించి కాలువ నిర్మిస్తామని అధికారులు ప్రకటించారు. ఆ తరువాత ఆ ఊసే లేదు. దీంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మళ్లీ వరద యథావిధిగా పునాదుల పైనుంచి ప్రవహిస్తోంది. వర్షం నీటికి దెబ్బతిన్న పునాదులపై చేపట్టే నిర్మాణాలు సురక్షితంగా ఉండవని ఇంజనీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల కంటే ముందు కొండ వరద మళ్లించే వ్యవస్థ ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు.

## రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి



నరసాపురం, డిసెంబర్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) :తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటచేలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు డిమాండ్ చేశారు. నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటచేలను గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను పొత్తూరి రామరాజు పరామర్శించి బాధితులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని ఏ విధమైన ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెదేపా మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు, సంకు భాస్కర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కుమారదేవం గురుకుల పాఠశాలకు వెళ్లే దారికి మోక్షం ఎప్పుడో..!



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం లో ఉన్న బాలయోగి గురుకుల పాఠశాల కు వెళ్ళాలి అంటేనే చాలా నరకం అనుభవించాలి ,గురుకుల పాఠశాల లో చదివే పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను చూడాటానికి రావాలంటే అటు దొమ్మేరు నుండి రావాలి,లేదా కుమారదేవం నుండి అయినా రావాలి కానీ ఈ రెండు మార్గాలు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి,కొంచెం వర్షం పడితే రావడానికి ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి రావాల్సి వస్తుంది,దయచేసి స్థానిక ఎమ్మెల్యే,హోమ్ మంత్రివర్యులు తానేటి వనితమ్మ సొంత గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాల కు వెళ్లే దారిని ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు తమ ఆవేదనను తెలియచేస్తున్నారు..

## తుఫాన్ ప్రభావం వల్ల ఇల్లు కోల్పోయిన బాధితురాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 7: ఇటీవల కురిసిన వర్షాలకు బురద కాలువ ఉధృతంగా ప్రవహించడంతో మండల కేంద్రమైనగోకవరం గ్రామానికి చెందిన పెరుమాళ్ సోమయమ్మ ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ విషయముపై జడ్పీటీసీ దాసరి రమేష్ ,ఎంపీపీ సంకర వీరబాబు, సీనియర్ నాయకులు కర్రి సురారెడ్డి అ కుటుంబాన్ని పరామర్శించి బాధితురాలికి తగిన సహాయం అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం గురువారం స్థానిక రెవెన్యూ సిబ్బందితో ఎంపీపీ, జడ్పిటిసి బాధితురాలికి ప్రభుత్వం తరపున 10000 రూ. ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అంతే త్వరలోనే మీ ఇంటి నిర్మాణానికి హౌసింగ్ స్కీం రప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో. వైకాపా టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సురారెడ్డి, వీఆర్వో శశికళ, వీఆర్ఏ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు నిల్ పని భారం ఫుల్ ఏపీలో ఆశా వర్కర్ల పరిస్థితి

### ఏఐటీయూసీ స్టేట్ డిప్యూటీ సెక్రటరీ ఎస్. వెంకటసుబ్బయ్య

కడప ప్రజాపాలన ప్రతినిధి: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు పెంచి వారికి పిఎఫ్,ఈఎస్ఐ అమలు చేయాలని కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సాముహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ స్టేట్ డిప్యూటీ సెక్రటరీ ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ,




రాష్ట్రంలో దాదాపు 55400 మంది ఆశా వర్కర్స్ పనిచేస్తున్నారని వారికి పదివేల రూపాయలు గౌరవ వేతనంగా ఇస్తూ ప్రభుత్వ పథకాలు రాకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ,ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చి ఆశ వర్కర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం స్పందించని ఎడల రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్లు వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

# యనమదుర్రుకు వరద.. ఎమ్మెల్యే గ్రంధి సమీక్ష



భీమవరం, డిసెంబర్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) :తుఫాను ప్రభావంతో ఎగువనుండి ఎర్రకాలువకు నీరు ఉదృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో యనమదుర్రు డ్రైన్ ఉదృతంగా ప్రవహిస్తోంది. గురువారం యనమదుర్రు డ్రైన్ నీటిమట్టం 32.8 అడుగులకు చేరుకోగా ప్రభుత్వం రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేసింది. భీమవరంకు వరద ప్రభావం తలెత్తే పరిస్థితి ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమదుర్రు డ్రైన్ నీటిమట్టం తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా డ్రైన్ గట్టు ఎక్కడైనా బలహీనంగా ఉంటే వెంటనే ఆ ప్రదేశాన్ని పటిష్టపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో ముంపునీరు ఎక్కడైనా ఉంటే ఆ నీటిని బయటకు తోడే విధంగా మోటర్లను ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి అన్ని సదుపాయాలను కల్పించాలని ఆయన ఆదేశించారు. యనమదుర్రు డ్రైన్ కు ఆనుకుని ఉన్న స్లూయిజ్ లకు ఎక్కడా కూడా లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని షట్టర్లను కూడా పరిశీలించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పట్టణంలో మిరామీయకోడు, గంగానమ్మగుడి వద్ద పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవ డానికి వ్యవసాయ అధికారులు సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తాసిల్దార్ వై రవి కుమార్, ఇరిగేషన్ డిఈ శ్రీనివాస్, ఏఈ వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, అగ్రికల్చర్ ఏఓ నిమ్మల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి



నరసాపురం, డిసెంబర్ 7 (ప్రజాపాలన ప్రతినిధి) :అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని రెండవ అంతస్తులో జిల్లా పరిషత్ నిధులు రూ 15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ 6 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన జెడ్పీటీసీ ఛాంబరు ప్రారంభోత్సవంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని జడ్పీటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలబత్తుల సోనిలతో కలిసి ఛాంబరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి ప్రభుత్వంలో అందిస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి ఎవరి పాలనలోను జరగలేదని అన్నారు. గత నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రజారంజక పాలన అందించి ఇతర రాష్ట్రాలకు సిఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రం లో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగాలంటే మరొసారి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోని, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, మైలాబత్తుల శ్రీను సర్పంచ్ తిరుమాని వెంకటరాజు, ఏఈ నాగేశ్వరరావు, గుత్తేదారుడు ఆకన యేసుబాబు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తుఫాను వల్ల పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన మండల కన్వీనర్ పాటి రాంబాబు



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 7: మండలంలోని రంపఎర్రంపాలెం దళిత వాడలో తుఫాను వల్ల కురిసిన వర్షాలకు కూలిపోయిన ఇళ్లులను, గ్రామం మధ్యలో నుండి వెళ్లి కాలువలు గండి కొట్టడంతో గురువారం గోకవరం మండల వైసీపీ కన్వీనర్ పాటి రాంబాబు తో నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తుఫాను వల్ల కాలువ ఉధృతంగా ప్రవహించడం వల్ల కాలువకు గండి కొట్టడం జరిగిందని,వర్షం వల్ల కూలిపోయిన ఇళ్ల బాధితులును ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులుకి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ తడిచిన రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవడం జరుగుతుందని, ఇప్పటికే తడిసి ధాన్యం, పచ్చి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయడానికి జిల్లా కలెక్టర్ వారు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రైతులు అందరూ అధైర్యం పడవద్దని ప్రభుత్వం అన్ని విధాలా అడుకొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ సర్పంచ్ తొట్ట సత్యనారాయణ మాజీ ఉప సర్పంచ్ పాటి అప్పలరాజు, వార్డు మెంబర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

### జగ్గంపేట కాంగ్రెస్ ఇంచార్జ్ శివ గణేష్



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 7.: గోకవరం మండలంలో వివిధ గ్రామాల్లో మీచౌంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పంట పొలాలను జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్ సందర్శించారు. అనంతరం గోకవరం మండలం తంటి కొండ గ్రామంలో వరి పంట పొలాలు నుస్వయంగా పరిశీలించారు. శివ గణేష్ మాట్లాడుతూ తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రతి ఎకరా భూమికి 30 వేల రూపాయలు తక్షణ సహాయం ప్రభుత్వం అందించాలని, తడిచిన మరియు మొలకలు మొలిచిన ప్రతి ధాన్యపు గింజను ఏ విధమైన షరతులు విధించకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, ప్రతి ధాన్యపు బస్తాకు ఎం ఎస్ పి గిట్టుబాటు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ అందించాలని, తుఫాన్ ప్రభావిత మొత్తం ప్రాంతంలో క్రాఫ్ లోన్లు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తాసిల్దార్ కు ఐదు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రాల రత్నాజీరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ కొండా శ్రీను, జగ్గంపేట నియోజకవర్గం బ్లాక్ టు అధ్యక్షులు బొల్లం బాపిరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ కోలపర్తి వీర వెంకటరావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బధి రెడ్డి ప్రాసద్ ,జగ్గంపేట మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాటే జయ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు

## సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్



విజయవాడ డిసెంబర్ 7 ప్రజా పాలన ప్రతినిధి పట్టణంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరి అమ్మవారి దేవస్థానానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ మొండితో కరుణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారుడ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో రూ.216 కో ట్ల అభివృద్ధి పనులకు సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి భూమి పూజ చేశారుఅనంతరం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి , ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అ రుణ్ కుమార్ , ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలుఈ సం దర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వేద ఆశీ ర్వచనం అందించిన వేద పండితులు అమ్మవారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈకార్యక్ర మం లో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనా రాయణ, హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీ నివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహల్లా, మహిళా కమిషన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ మేయర్ రాయ న భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## రైతులకు అండగాఉంటాం: ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



చందర్లపాడు డిసెంబర్ 7 ప్రజాపాలన ప్రతినిధితుఫా ను వలన నష్టపోయిన రైతులకు శాసనసభ్యులు డా క్టర్ మొండితోక జగన్ మోహన్ రావు అండగా నిలి చారు. పారదర్శకంగా పంట నష్టం అంచనా వేసి రైతు లకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రకృ తి విపత్తుల వల్ల చేతికొచ్చే దశలో వరి పైరు నేలకొర గటం పట్ల బాధను వ్యక్తం చేశారు చందర్లపాడు మం డలంలోని పొక్కునూరు, కాసరబాద, కొడవటికల్లు, ఉ స్తేపల్లి గ్రామాల్లో మిచాంగ్ తుఫాన్ ఉధృతికి దెబ్బతి న్న వరి, మిరప పైరులను గురువారం ఆయన పరిశీ లించారు. రైతుల సాధక బాధలు తెలుసుకొని, జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి పంట నష్ట ప రిస్థితులను స్వయంగా తెలియజేశారుఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పోరుమామిళ్ల చుట్టుప్రక్కల మండలాల ప్రజలకు సంజీవనిగా రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు



పోరుమామిళ్ల ప్రజాపాలన ప్రతినిధి: కలసపాడు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళ కు పోరుమామిల్లలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు ఆపరేషన్ నిమిత్తమై హాస్పిటల్లో చేరగా హాస్పిటల్ వైద్య సిబ్బంది ఓ పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలుపగా పేషెంట్ తాలూకా బంధుమిత్రులు రక్తం కోసం, ప్రభుత్వ ఆసుపత్రి లోని రక్త నిధి కేంద్రం మరియు స్నేహితులను అడిగే ప్రయత్నం చేయగా ఎక్కడ దొరకని చివరి క్షణాల్లో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ను ఆశ్రయించగా ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ స్పందించి పోరుమామిళ్ల పట్టణానికి చెందిన షేక్ అస్లాం చే ఓ పాజిటివ్ రక్తం అత్యవసరంగా రక్త దానం చేపించారు. ఈ సందర్భంగా సంస్థ పౌండర్ రసూల్ ప్రసాద్ లు అడిగిన వెంటనే , రక్త దానం చేసినదుకు అభినందిం చారు. రక్త దానం చేయాలని ఉత్సాహవంతులు దయచేసి స్వచ్ఛంద సేవకులు మాలాంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు చేయూతనిచ్చి అత్యవసర పరిస్థితిలో రక్తమందక కొట్టుమిట్టలాడుతున్న రోగుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలనుకుంటే 8125991900,వాట్స్ అప్ నంబర్ కి మెసేజ్ చేయాలని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బలరామ్



వేటపాలెం, డిసెంబర్ 07, ప్రజాపాలన : వేటపాలెం మండలం కొత్తపేటలో రావిసుబ్బారాయుడు కళ్యాణ మండపంలో, జరుగుతున్నముని సిపల్ డి.ఇ.ఏసయ్య మేనల్లుడు సతీష్‌చంద్ర-మౌనిక ల వివాహమహోత్సవానికి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై, వధూ వరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే బలరామ్ వెంట, మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, చీరాల మండలంపార్టీ అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, వివిధ హోదాలో ఉన్న నాయకులు, మున్సిపల్ అధి కారులు తదితరులు ఉన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**శుక్రవారం 08, డిసెంబరు 2023**

# మెరుగ్గా 'ఆడుదాం ఆంధ్ర'

"ఆడుదాం–ఆంధ్ర" దేశంలోనే అతిపెద్ద మెగాటోర్నీగా చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. యువతను క్రీడలవైపు ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన సమాజం వైపు నడిపించడంపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. ప్రపంచీకరణ యుగంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధించాము. దాంతో పాటు అంతే స్థాయిలో అసమానతలూ పెరిగాయి. ఇప్పుడున్న యువతరం ఆటలు అంటే మొబైల్ ఫోన్‌లో ఆటలే అనే పరిస్థితి ఏర్పడింది. పోటీ ప్రపంచంలో మెజారిటీ విద్యార్థులకు, యువతకు ఆటలు దూరమై చాలా కాలం అవుతుంది. అంతేకాక డ్రగ్స్‌కు, ఇతర చెడు అలవాట్లకు యువత బలి అవుతుంది. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న గ్రామీణ, సంప్రదాయ క్రీడలను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా ఉండాలి. ఇవి గెలుపు కోసమో లేదా ప్రైజ్ మనీ కోసం మాత్రమే కాదు. మనుషుల మధ్య ఐక్యతకు దోహదం చేస్తాయి. శారీరక మానసిక ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. ముఖ్యంగా దేహదారుఢ్యం పెంచుతుంది. ఆరోగ్యకరంగా ఉండడానికి ఎంతో దోహదపడుతుంది. క్రీడల వల్ల చదువు పట్ల ఏకాగ్రత పెరుగుతుందని అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా "ఆడుదాం ఆంధ్ర" పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించడాన్ని అభినందించాలి. దీంతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలకు కూడా ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహిస్తే బాగుండేది. ప్రాథమిక స్థాయి నుంచి ఇటువంటి ఆటల పోటీలు పిల్లలకు నాయకత్వ లక్షణాలు నేర్పుతాయి. సమిష్టితత్వం అలవడుతుంది. ఇందులో అథ్లెటిక్స్ కూడా చేర్చి ఉంటే మరింత ఉత్సాహంగా యువత పాల్గొనేవారు.ఇదంతా బాగానే ఉన్నా ఈ పోటీలకు గ్రామాల్లో, మండలాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో తగిన ఆటస్థలాల్లేవు. మరి ఎక్కడ నిర్వహిస్తారన్నదే పశ్న. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందు గ్రామ స్థాయి నుంచి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి, క్రీడా సామగ్రిని సమకూర్చి, వసతులు కల్పిస్తే "ఆడుదాం ఆంధ్ర" తప్పకుండా విజయం సాధిస్తుంది. ప్రస్తుత స్థితి అయితే కేవలం ప్రభుత్వ ప్రచార ఆర్భాటం కోసం హడావుడిగానే మిగిలిపోతుంది. ఇప్పటికే క్రీడల్లో మన రాష్ట్రం బాగా వెనుకబడి ఉంది. కొన్ని క్రీడా మైదానాలు కబ్జాకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రాయలసీమ విశ్వవిద్యాలయంలోనే స్టాండింగ్ ట్రాక్‌లు లేవంటే మారుమూల గ్రామాల పరిస్థితి అర్థం అవుతుంది. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకునే నాడు నేడు పేరుతో ఒక్క క్రీడా మైదానాన్ని నిర్మించారా? గత ప్రభుత్వం గాండీవం పేరుతో పాంచజన్య ప్రాజెక్టు కింద నిధులు కేటాయించినా పూర్తి స్థాయిలో ఖర్చు చేయకుండా క్రీడలకు అన్యాయం చేసింది. ప్రస్తుత యువ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పరిస్థితి మారుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. సిఎం పుట్టిన రోజున సీఎం కప్పు పేరుతో క్రీడలు నిర్వహించి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు తప్ప నిధులు ఇవ్వలేదు. దీంతో పిల్లల చార్జీలు, ఇతర ఖర్చులు పీడీలు, పీఈటిలే భరించారు. ఇంకొన్ని చోట్ల విద్యార్థులే భరించాల్సిన పరిస్థితి వచ్చింది. అంత పెద్ద టోర్నీ నిర్వహించి నిధులు ఇవ్వకపోవడం ఎమిటి? గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి ప్రోత్సాహకాలు ఇప్పటివరకు అరకొరగా చెల్లించింది. ఇందులో స్వర్ణపతకం 5 లక్షలు, రజిత పతకం 4 లక్షలు, క్యాంసం పతకం సాధించిన వారికి 3 లక్షల రూపాయల చొప్పున అందించాలి. జీవోలు ఇచ్చారు తప్ప నగదు మాత్రం ఇవ్వకుండా శాప్ కార్యాలయం చుట్టూ క్రీడాకారులను ప్రదక్షిణలు చేయిస్తున్నారు. మరి ఈ ఏడాది గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహకాలు ఎప్పుడిస్తారో చూడాలి!శాప్ తీరే క్రీడాకారులకు శాపంరాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడం, శిక్షణా, క్రీడా సామగ్రి ఇచ్చి ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఉద్దేశం. కానీ ఇప్పుడు దానికి బదులుగా శాప్ వ్యాపారం చేస్తోంది. ఎవరైనా క్రీడలు నేర్చుకోవాలని ప్లే గ్రౌండ్‌కు వస్తే గంటల చొప్పున రేటు నిర్ణయించారు. క్రీడా మైదానాలను, స్టేడియాలను, స్విమ్మింగ్ ఫూల్, జిమ్ సెంటర్లను నిర్వీర్యం చేసేందుకు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. మహిళా క్రీడాకారులను వేధించడంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడం, నగదు ప్రోత్సాహకాల కోసం వచ్చిన వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం, సామగ్రి కొనుగోలులో అవినీతి ఆరోపణలొస్తున్నాయి. ఇటీవల కాలంలో శాప్‌లో కోచ్‌ల రిక్రూట్మెంట్ లేదు. పర్మినెంటు కోచ్‌లు పట్టుమని పదిమంది లేరు. కనీస వేతనాలివ్వడం లేదు. గత ఐదు నెలలుగా వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఔట్ సోర్సింగ్ ద్వారా తీసుకున్న కోచ్‌లకు వేతనం రూ. 19,500, ఊా%ూా% కోచ్‌లకు వేతనం రూ.15,000 ఇస్తున్నారు. చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు కోచ్‌లు. అర్హత, వారు సాధించిన పతకాల ఆధారంగా కోచ్‌లను ఎందుకు పర్మినెంట్ చేయడం లేదు?షెడ్యూల్‌జిడిసెంబర్ 15 నుంచి 20 వరకు గ్రామ/వార్డు స్థాయిలో, 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయిలో, జనవరి 5 నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలకు 15 ఏళ్ల వయసు నుంచి పైబడిన ప్రతి ఒక్కరూ అర్హులే. ప్రతి క్రీడాకారుడూ రెండు క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంది. అన్ని క్రీడా పోటీల్లోనూ మహిళలకూ ప్రవేశం ఉంది. వారికి వేరుగా పోటీలు నిర్వహిస్తారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ ప్రభుత్వం ఇచ్చిన లింక్ ద్వారా గానీ, 1902కి కాల్ చేసి గానీ, సచివాలయం దగ్గర గానీ, వలంటీర్ల ద్వారా గానీ నమోదు చేసుకోవచ్చు. మొత్తం 3 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తారు. వీటితో పాటు కాలయాపన కోసం యోగా, మారథాన్, టెన్నీకాయిట్ వంటి పోటీలేని సంప్రదాయ క్రీడలు నిర్వహించనుంది. ఈ క్రీడలను ఎవరు నిర్వహించాలి ?రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు టోర్నీని జిల్లా కలెక్టర్, సిఇఓ, చీఫ్ కోచ్‌ల సమన్వయంతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎలా నిర్వహిస్తారు?

**సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు**
editor. prajapalana@gmail.com
**మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన**
**దినపత్రికలో ప్రచురించబడును**

# ఈ విజయం తెలంగాణ ప్రజల తొలి విజయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ప్రజలు ఉద్యమ స్ఫూర్తితో సాధించిన తొలి విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం. రేవంత్ రెడ్డి నాయకత్వంలో 2023 డిసెంబర్ 7వ తేదీన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రెండేళ్ళుగా విరామం ఎరుగక తిట్లు, అవమానాలు ఎదుర్కొంటూ, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌ను నిద్రలేపి విజయపథంలోకి నడిపించిన పోరాట యోధుడు రేవంత్ రెడ్డి. బిఆర్ఎస్‌లో కేసిఆర్, కేటిఆర్, హరీష్‌రావు, కవిత వంటి ఉద్దండులు అధికార దండం చేతిలో ఉన్నవాళ్ళు నలుగురు నాలుగువైపులా దాడి చేస్తుంటే అభిమన్యుడిలా ఒకే ఒక్కడు పోరాడి తెలంగాణ ప్రజల, నిరుద్యోగుల, ఉద్యోగుల, విభిన్న వర్గాల ఆశలను సాకారం చేసిన రేవంత్ రెడ్డికి అభినందనలు.

ప్రజలు చాలా కాలం నుంచి బిఆర్ఎస్‌ను పక్కన పెట్టాలనుకున్నారు. సచివాలయానికి రాకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు కలవడానికి అవకాశం లేకుండా ప్రగతిభవన్, ఫాం హౌజ్‌కు పరిమితమైనప్పటినుండి ప్రజలు దించేయాలనుకున్నారు. దించడానికి ఒక యోధుడు కావాలి. రేవంత్ రెడ్డి అలా అందివచ్చిన యోధుడు. ఉదాత్తమైన ఉన్నత లక్ష్యాలు కలిగి జీవితంలో ముఖ్యమంత్రిని కావాలని 20 యేళ్ళ వయస్సునాడే లక్ష్యం నిర్ణయించుకున్న రేవంత్ రెడ్డి ఎంత ఓపికతో అన్ని విమర్శలను, సీనియర్ల అడ్డంకులను అభిమానంగా మార్చుకొని ఎదిగారు.

రేవంత్ రెడ్డి ఎదిగిన క్రమం నేటి రాజకీయాల్లో ఎదగదల్చుకున్న వారికి స్ఫూర్తి. రేవంత్ రెడ్డి జడ్పీటీసీగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి యంఎల్సీగా ఎన్నికయ్యారు. టిడిపి, కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, యంపీగా ఎన్నికయ్యారు. రేవంత్ రెడ్డి మంత్రి కాకుండా డైరెక్ట్‌గా ముఖ్యమంత్రి అయి అరుదైన రికార్డు సృష్టించారు.

కులం ఒక్కటే అయినా, గా గాలికి తిరిగే పిలగాడికి నా బిడ్డను యిస్తానా అని నిరాకరిస్తే, రుక్మిణిని శ్రీకృష్ణుడు తీసుకొనిపోయి పెళ్ళి చేసుకున్నట్టుగా పెళ్ళి చేసుకున్న ధీరుడు, వ్యక్తిగత జీవితంలో ప్రేమికుడు రేవంత్ రెడ్డి. మాజీ కేంద్ర మంత్రి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సుప్రసిద్ధుడైన మేధావి జైపాల్ రెడ్డిగారి సోదరుని కూతురును పెళ్లి చేసుకున్నాడని ఇటీవలి దాకా జనానికి తెలియదు. ఆ రక్త సంబంధాన్ని ఉపయోగించుకొని రేవంత్ రెడ్డి రాజకీయాల్లో ముందుకు రాలేదు. ఈ విషయం కేటిఆర్, కవిత, హరీష్‌రావు వంటివారు, బీసీలు గుర్తుంచుకోవాలి. ప్రతి నిమిషం



కేసిఆర్‌తో గల రక్త సంబంధాన్ని గుర్తుచేసి బ్రాండ్ ఇమేజ్ నీడ కింద ఎదిగినవారు వీళ్ళు. కానీ రేవంత్ రెడ్డి అలా కాదు. రెడ్డి కుల సంఘం మీటింగులో ఏం మాట్లాడాడో బీసీలు దాన్ని చిలువలు, పలువలుగా చెప్పుకుంటూ వచ్చారు. అది నిజమే కావచ్చు. ఏ కుల సంఘం మీటింగులోనైనా ఆ కులం వాళ్ళు మనమంతా ఒకటి కావాలి. అధికారంలోకి రావాలి అని చెప్పకుండా ఉన్న కుల సంఘం ఏదైనా ఉందా? కుల సంఘాల సభలు అట్లాగే సాగుతాయి.

జలగం వెంగళరావు జీవితం సర్పంచ్‌తో ప్రారంభమైంది. అంచలంచెలుగా ఎదిగి అవకాశం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి అయ్యాడు. అలాగే టంగుటూరి అంజయ్య ఆరు అణాల కూలిగా ప్రాచుర్యం పొంది క్రమక్రమంగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యాడు. ముఖ్యమంత్రి అయ్యాక చంద్రబాబు నాయుడు, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వంటి యువకులకు మంత్రి పదవులు ఇచ్చి భవిష్యత్తుకు బాట వేశారు. ఆయన ఎంతోమంది బీసీలను, ఎస్సీలను కూడా మంత్రులను చేశాడు. కానీ వాళ్ళు అక్కడే ఆగిపోయారు. ముఖ్యమంత్రి స్థాయికి ఎదగలేక పోయారు.

ప్రజాస్వామ్యంలో సంఘటిత శక్తి ప్రదర్శన, బల ప్రదర్శన చాలా ముఖ్యాంశం. అది రాజకీయ ప్రాతినిథ్యం లక్ష్యమై ఉండాలి. ఫాలో అప్ కార్యక్రమాలు తీసుకోవాలి. తుక్కుగూడలో రేవంత్ రెడ్డి కష్టపడి పెట్టిన కాంగ్రెస్ సభ గొప్ప సక్సెస్. ఇలా శక్తి ప్రదర్శన చేసినపుడే బీసీలకు 52 శాతం జనాభాకు కనీసం 35 శాతం సీట్లయినా, టికెట్లయినా ఆయా పార్టీలు యిస్తాయి. ఇండిపెండెంట్లుగా కూడా గెలువవచ్చు.

రాజకీయాల్లో గెలవడానికి దీక్ష, పట్టుదల, సహనం, ఓపిక వ్యూహం అవసరం. ఒక ప్రాథమిక ఉపాధ్యాయుడు పరీక్షలు పాసై ప్రమోషన్లు కొడుతూ స్కూల్ అసిస్టెంట్‌గా, హెడ్మాస్టర్‌గా, లెక్చరర్, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా, డిగ్రీ కాలేజి లెక్చరర్‌గా, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్‌గా ఎదిగి రిటైరనట్టుగా రాజకీయాల్లో ఎదగాల్సి ఉంటుంది. ఇందుకు సుప్రసిద్ధ చరిత్రకారుడు జగిత్యాలకు చెందిన జైశెట్టి రమణయ్య ఉదాహరణ. క్లర్క్ క్రమక్రమంగా పరీక్షలు పాసై యుడిసీగా, హెడ్ క్లర్క్, సూపరిండెంట్‌గా, డిప్యూటి తాహసిల్దార్‌గా, తాహసిల్దార్‌గా, ఆర్డీవోగా, డిఆర్‌గా, డైరెక్టర్‌గా ప్రమోషన్లు పొందినవారు ఎందరో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, మాజీ గవర్నర్ సుశీల్ కుమార్ షిండే పోలీసు ఉద్యోగం నుండి అంచలంచెలుగా ఎదిగారు. వారు ఎదిగిన క్రమాన్ని చూసి స్ఫూర్తి పొందాలి. ఉత్తేజితులు కావాలి. అందుకు వారి జీవిత చరిత్రను, వ్యక్తిత్వ నిర్మాణాన్ని అధ్యయనం చేయాలి. తనను తాను మలచుకోవాలి.

రెడ్లకు, వెలమలకు, వారి సామాజిక వర్గాలవారు ఆర్థికంగా, నైతికంగా చేయూతనిచ్చి గెలిపిస్తారు. రాజకీయంగా బీసీలు, ఎస్సీలు ఎదగాలి అని కోరేవాళ్ళు వారి ఎదుగుదలకు ఆర్థికంగా, నైతికంగా సహకరించాలి. నిరంతరం అభద్రతతో బతుకుతూ తన వెంట ఎప్పటికీ పదిమందిని తిప్పుకుంటూ ఆ ఖర్చులు పెట్టుకోవాల్సిన రాజకీయ రంగంలో ఉండేవారికి ఒక నెల జీతం ఇచ్చి నిలపాలి. అది సాధ్యమైనపుడు ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోయినా బీసీలు 50 శాతం ప్రజలు సర్పంచ్‌లు మొదలుకొని ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌లుగా, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలవడం సాధ్యమే!.

రచయితలైనా, రాజకీయ నాయకులైనా అవకాశాలు అందిపుచ్చుకోవాలి. అవకాశాలను సృష్టించుకోవాలి. తనను తాను నిరూపించుకోవాలి. రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజం. గెలుపోటములు సహజం. ముంచేసే వరదలో మహా ప్రవాహంలో ఈది ఒడ్డుకు చేరడం, విజయం సాధించడ ఎలాగో తెలుసుకోవడానికి రేవంత్ రెడ్డి జీవితాన్ని అధ్యయనం చేయడం అవసరం.

**బి. ఎస్. రాములు**
**బీసీ కమిషన్ తొలి ఛైర్మన్,**
**తెలంగాణ రాష్ట్రం**
**8331 966 987**

# తుపాను పాఠాలు...

రాష్ట్ర ప్రజలను భయోత్పాతంలో ముంచెత్తిన మిచౌంగ్ తుపాను తీరం తాకి బలహీనపడినా మూడు రోజుల పాటు కోస్తా జిల్లాలతో పాటు, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర నష్టం కలిగించింది. ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంది. అయినప్పటికీ, కొందరు మృత్యువాత పడ్డట్లు వార్తలు వచ్చాయి. అయితే, బుధవారం నాటికి కూడా అధికారిక సమాచారంలో ఈ మరణాలు చోటుచేసుకోకపోవడం బాధాకరం. ప్రాణనష్టం అంతగా లేకపోవడం కొంత ఊరట కలిగిస్తున్నప్పటికీ, భారీగా జరిగిన పంట నష్టం, ఆస్తి నష్టం కలిచివేస్తున్నాయి. కోతకొచ్చి పంట నీట మునిగిన దృశ్యాలు కోస్తా జిల్లాలో ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి.బాపట్ల వద్ద మంగళవారం తీరం దాటే క్రమంలో గంటకు 100 నుండి 120 కి.మీ వేగంతో వీచిన ప్రచండ గాలులతో అనేక చోట్ల చెట్లు, విద్యుత్ స్థంబాలు నేలకూలాయి. గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలతో అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. ఈ లెక్కలన్నీ తేలితే కానీ, వాస్తవంగా జరిగిన నష్టం ఎంతన్నది స్పష్టం కాదు.లక్షలాది ఎకరాల వరిపంట నీట మునిగింది. కొన్ని చోట్ల కోసి పొలాల్లో వేసిన ఓదేలు నీళ్లలో తేలుతూ కనపడుతున్నాయి. కళ్లాల్లో పోసిన ధాన్యం కూడా తడిసిముద్దయింది. తుపాన్ తీరం దాటిన బాపట్ల జిల్లాలోనే దాదాపు 2 లక్షల ఎకరాల దాకా వరిపంట నీటమునిగినట్టు ప్రాథమిక సమాచారం. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కూడా కొంచెం అటుఇటుగా ఆ స్థాయిలోనే నష్టం జరిగినట్ట చెబుతున్నారు. నెల్లూరు,తిరుపతి జిల్లాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కూడా కూడా వరిపంట నీట మునిగింది. వేల రూపాయల పెట్టబడితో పాటు, ఆరుగాలం పడ్డ కష్టం నీళ్ల పాలు కావడం రైతాంగం గుండెలు బాదుకుంటోంది. మిర్చి, పొగాకు, వేరుశనగ, పసుపు తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నానా కష్టాలు పడి పంటలు సాగు చేసిన



రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బొప్పాయి, అరటి వంటి పండ్ల తోటలు సాగుచేసిన వారి దుస్థితి కూడా ఇంతే!కొన్ని చోట్ల సహాయశిబిరాల్లో భోజన ఏర్పాట్లు కూడా లేవంటూ వార్తలు రావడం బాధాకరం. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలి. ప్రకృతి విపత్తు కారణంగా సర్వస్వాన్ని కోల్పోయిన బాధితులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం అండగా నిలవాలి. నష్టాలకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి. ఈ లోగా బాధితులకు తక్షణ సాయం అందించాలి. రైతుల వద్ద ధాన్యం ఏ స్థితిలో ఉన్నా భేషరతుగా కొనుగోలు చేయాలి. తేమశాతం ఎక్కువగా ఉందనో, ఇతర నాణ్యత ప్రమాణాల పేరు చెప్పో మీనమేషాలు లెక్కించకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. లెక్కలు తేలిన తరువాత పూర్తిస్థాయి పరిహారం అందచేయాలి. హుదూద్ తుపాన్ సందర్భంగా ప్రకటించిన సాయం కూడాకూడా అరకొరగానే అందిందంటే రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పటికైనా కేంద్రం ఈ వైఖరి వీడాలి. లేని పక్షంలో ప్రతిపక్షాలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడాలి.మన రాష్ట్రానికి తుపాన్లు కొత్త కాదు. ప్రతి సంవత్సరం దాదాపుగా ఈ విపత్తుల బారిన పడుతూనే ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 1970 నుండి ఇప్పటి వరకు దాదాపు 60కి పైగా తుపాన్లు రాష్ట్రంపై ప్రభావం చూపాయి. వీటిలో తీవ్ర, అతితీవ్ర తుపాన్లు 35కు పైనే ఉన్నాయి. ఏడు తీవ్ర, అతి తీవ్ర తుపాన్లు రాష్ట్రంలోనే తీరం దాటాయి. తీర ప్రాంత జిల్లాల్లో దాదాపుగా 3. 50కోట్ల జనాభా రాష్ట్రంలో నివసిస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రానున్న సంవత్సరాల్లో ప్రకృతి వైపరీత్యాల ముప్పు మరింతగా పెరగనుంది.

కోస్తా జిల్లాలో ముఖ్యంగా కృష్ణా, గోదావరి డెల్టాలో తొందరగా ఖరీఫ్ వరినాట్లు వేసేలా నీటియాజమాన్య చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. ఇందులో రాజకీయ ప్రయోజనాలు, లేదా వ్యక్తిగత ప్రతిష్టలకు పోవడం గాకుండా రైతు ప్రయాజనాలను పరమావధిగా ప్రభుత్వం భావించాలి. తాత్కాలిక చర్యలతో పాటు, మడ అడవులను కాపాడటం, పెంచడం వంటి దీర్ఘకాల చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ శాఖను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలి.

# జాతీయ స్కేటింగ్ హాకి పోటీలకు ఎంపికైన డా॥ కె.కెఆర్ గౌతమ్ విద్యార్థులు



గుడివాడ : ఇటివల విశాఖపట్నంలో జరిగిన జాతీయస్థాయి క్యాంప్‌లో జరిగిన పోటీలలో గుడివాడ డా॥ కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థులు జాతీయస్థాయి రోలర్ హాకీ(క్యాడెట్‌టిమ్) బాలుర విభాగంలో జి.శ్రీమంత్, ఎన్,ఎన్ అభిలాష్, ఎన్.ఎల్ సాత్విక్,లు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఇ.నిఖీల, ఎం.ఖ్యాతిఅభిజ్ఞలు ఎపి జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సపల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనాలు తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో మాట్లాడతూ డిశంబర్ 10 నుండి 22 వరకు ఛండీషుర్‌లో జరిగే 61వ జాతీయస్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో శ్రీమంత్, అభిలాష్, సాత్విక్‌లు, రాష్ట్రస్థాయిలో ఇ.నిఖీల, ఎం.ఖ్యాతి అభిజ్ఞలు పాల్గొనడం జరుగుతుందన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటిలకు ఎంపికైవడం అభినందనీయమన్నారు. కోచ్ పి.ఎన్.వి.ఎస్ అయ్యప్పను, విద్యార్థులను అభినందిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

## బిసి భవనం ఏర్పాటుకు కృషి చేయాలని బిసి సంఘ నేతల ఎమ్మెల్యే కొడాలి నానికి విన్నతి



గుడివాడ : గుడివాడ పట్టణంలో బిసి భవన్ం కోసం స్థలాం కేటాయించాలని నియోజకవర్గం బిసి సంఘం అధ్యక్షులు దారం నరసింహరావు ఆధ్వర్యంలో స్థానిక శాసన సభ్యులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కలసి విన్నతి పత్రాని గురువారం అయన స్వగృహంలో అందజేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకోల్లు మల్లేశ్వరావుతో దారం నరసింహరావు మాట్లాడుతూ గతంలోనే బిసి భవన్ నిమిత్తము 2,000 గజాలు స్థలం ప్రభుత్వం ద్వారా శాక్షాన్ చేయించామని ఎమ్మెల్యే నాని కోరటం జరిగిందన్నారు. ఇపుడు పట్టణంలో రిజ్వర్ స్థలాని కేటాయించలని కోరడంతో ఎమ్మెల్యే నాని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో సంప్రదించి వెంటనే స్థలాం ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పాడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు నైనవరపు శేషు, సబ్బాని రంగారావు, మహిళా ఉపాధ్యక్షురాలు తానా రాధ, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు గుళిపల్లి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు దొండపాటి వెంకటకృష్ణారావు, రూరల్ కన్వీనర్ బోయిన సోమశేఖర్, కలవగుంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి: టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల



గుడివాడ : మిచౌంగ్ తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాని వెంటనే అధికారులు పంటా నష్టం రైతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అధికారులు కోరారు. బుధవారం నియోజవర్గంలోని గుడ్లవల్లేరు మండలం అంగలూరు గ్రామంలో నీట మునిగిన పంటా పోలాలను వెనిగండ్ల రాము పరిశీలించారు. అనతరం అంగలూరు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని ఎంఆర్‌ఓకు ఫోను చేసి నష్టపోయిన రైతులను అదుకోవాలని, సబ్సిడిపై విత్తనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్యక్రర్తలు పాల్గొన్నారు.

## ఏ స్థితిలో ఉన్న ధాన్యాన్ని అయిన కోనుగోలు చేసి రైతులను అదుకుంటాం: ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ : ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం ముమ్మాటికి రైతు సంక్షేమ ప్రభుత్వమని, తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగానికి నూరు శాతం సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. గురువారం గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు పరిసర గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పైరు దెబ్బతిన్న రైతులకు ఆర్.బి.కె కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుందన్నారు. తుఫాను తీవ్రతను ఎప్పటికప్పుడు కలెక్టర్ల ద్వారా సీఎం జగన్ సమీక్షించారని, రైతులు ఎవరు ఆందోళన చెందనవసరం లేదని నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేలా ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్ల శ్రీను, రవి, విక్టర్, రామకృష్ణ, చంటి, నాగు, సుజాత, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్ కు దెబ్బతిన్న రైతులని వెంటనే ఆదుకోవాలి

## టిడిపి రాష్ట్ర కార్యదర్శి జువ్వ రాంబాబు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : ఇటీవల కురిసినటువంటి తుఫాన్ వలన పంట నష్టం జరిగింది ఆస్తి నష్టం జరిగింది. ఈ రోజున దాదాపు తుఫాను వచ్చి మూడు రోజులు జరుగుతున్న కూడా రెవెన్యూ వ్యవస్థ కానివ్వండి వ్యవసాయ శాఖకు సంబంధించిన యంత్రాంగం కానివ్వండి కనీసం కదలిక కూడా లేవు. ఈ రోజున వేల కోట్ల రూపాయలు పంట నష్టం జరిగింది ఈ రాష్ట్రంలో ముఖ్యంగా ఈ తుఫాను వలన రైతులు అన్ని పంటలు పూర్తిగా నష్టపడడం జరిగింది. వరి దాదాపు 40 వేలు50 వేలు ఖర్చుపెట్టి పంట చేతికి వచ్చిన సమయంలో కవలించివేసి రైతులని నిట్ట నిలువునా ముంచేసింది అట్లాగే ప్రతి చేతికి వచ్చినటువంటి పత్తి పంట ఎటు కాకుండా పోయింది అలాగే మిర్చి,మొక్కజొన్న అలాగే అరటి అనేక పంటలు ఈ కృష్ణా డెల్టాలో లక్షల ఎకరాలు దెబ్బతిన్నాయి. రైతులు ఏం ఏం చేయాలో తెలియక కొట్టుమిట్టు ఆడుతున్న పరిస్థితుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి కేవలం చీమకుట్టినట్టు కూడా లేదు ఈ పరిస్థితులను చూస్తుంటే చాలా బాధాకరం విచారకరం. ప్రభుత్వం చేతగాని మాటలు చెప్పడం కాదు ఈ పంట నష్టపోయిన రైతాంగాన్ని పూర్తిగా ఆదుకోవాల్సిన బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది మిర్చి పంట ప్రధానంగా ఉన్న పత్తి పంట ఈ రెండు పంటలు పూర్తిగా సర్వనాశనం అయిపోయినాయి దానితోపాటు గోన్ చుట్టు మీద రూపాయి పూతలాగా రైతాంగం దగ్గర ఏ విధంగా ఆర్థిక సహాయం లేకుండా దోచుకుంటున్నటువంటి మిల్లర్లు కానివ్వండి రైతులని నిట్ట నిలువునా నాలుగున్నర సంవత్సరాల నుంచి ముంచేస్తూ ఉన్నారు దానితోపాటు తుఫాను కూడా ముంచేసింది మనకి దాదాపు పట్టిసీమ నీళ్లు ఉన్నాయి వాటిని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జూన్ 20,24 వ తారీఖున పట్టిసీమ నీళ్లు వదులుతా ఉండే వాళ్ళము. మైలవరం ప్రాంతంలో ఉన్న మెట్ట ప్రాంతం మొత్తం కూడా పట్టిసీమ నీళ్లతో నవంబర్ 10,12 తారీకులలో కోతలకు వచ్చేసేవి అన్ని పంటలన్నీ కూడా చేతికి వచ్చేసేవి మరి ఈ ఒక్క ప్రభుత్వం కనీసం నిమ్మకు నీరెత్తినట్టు పరిస్థితుల్లో ఉంది కృష్ణా డెల్టా లో ఉన్న నీళ్లు ఇవ్వాల్సిన అవసరం ఉంది. పట్టిసీమ ప్రాజెక్టు లో 21 పంపులు మూలనపడేసి చివరికి గత్యంతరం లేక ఈ ప్రభుత్వం మీద తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది అనే భావనతో ఆగస్టు సెప్టెంబర్ లో పట్టిసీమ నీళ్లు వదిలి నిట్ట నిలువునా ముంచేశారు. ఇందులో ప్రధానంగా ఉన్నటువంటి మైలవరం నియోజకవర్గం శాసనసభ్యుడు ఆయన ప్రతి విషయంలో కూడా నేను అది చేసే ఇది చేశాను చెబుతా ఉంటాడు డిసెంబర్ తుఫాన్ వచ్చినటువంటి ఆరోజు కూడా తుఫాను వచ్చి రైతాంగాన్ని పూర్తిగా నిట్ట నిలువునా ముంచేసిన ఆ రోజు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రంలో ముక్కుపోయినటువంటి ధాన్యాన్ని ప్రతి ఒక్క పంట రైతులని పూర్తిగా ఆదుకోవడం జరిగింది. 2003 సంవత్సరాన్ని ఒకసారి గుర్తు చేసుకోండి ఆ రోజున పూర్తిగా నష్టపోయినటువంటి రైతులని ముక్కు పోయిన మురిగిపోయిన మొలకెత్తినటువంటి ధాన్యాన్ని మార్కెటింగ్ యాడ్ ద్వారా ప్రతి ఒక్క గింజను కూడా రైతుల ఎవ్వరూ నష్టపోకుండా ఆ రోజున చంద్రబాబు నాయుడు ఆదుకోవడం జరిగింది. కరెక్ట్ గా 20 సంవత్సరాల తర్వాత ఈ తుఫాన్ రైతాంగాన్ని కవలించి వేసింది అట్లాగే మేము డిమాండ్ చేసేది ఏంటంటే ఆర్థిక సహాయాలు అవి ఇవి కాదు ఈ ఒక్క ప్రభుత్వం ఈ ఒక్క ఎమ్మెల్యే ప్రతి ఒక్క గింజని కొనాల్సినటువంటి బాధ్యత మీపై ఉంది. ఈ మైలవరం ప్రాంతం పూర్తిగా ఇవ్వాలా 2% కూడా కోతలు కోయినటువంటి పరిస్థితుల్లో ఉంది. ఒక బస్తా వడ్లు కూడా వచ్చేటువంటి పరిస్థితుల్లో రైతాంగం లేదు ఆత్మహత్యలు శరణ్యంగా రైతంగం ఉంది ఇక్కడ మేము రాజకీయాలే మాట్లాడట్లేదు ఆదుకోవాల్సినటువంటి బాధ్యత ఈ స్థానిక శాసనసభ్యుడు కి ఉంది ప్రతి ఒక్క గింజను కూడా కొనాలి కొనిపించాల్సిన బాధ్యత ఈ స్థానిక శాసనసభ్యుడు కి ఉంది అని డిమాండ్ చేశారు..


నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకుంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలకు మీ కలం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం...? మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి....
జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా, మండలాల వారీగా విలేకరులను ఆహ్వానిస్తుంది
అర్హత : నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే సత్తా ఉండాలి
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి..:
సెల్ : 8886022523, 9000621111,9848725373

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500
కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600
Contact : 8886022523, 9000621111, 9948725373

Serves Members Serves People Connects Members
SNEHA CLUB
Pay Back to Society... Not to criticise any one...
All the donation to SNEHACLUB are exempted fromincome tax under section 80G of income tax act, 1961
Join & Support
Let this MISSION reach to the ROOTS of the SOCIETY for extending MUTUAL HELP
WE DARE ... to achieve what we wish
WE CARE ... to support us
Contact: 7416358036

కావలెను
స్నేహ గ్రూప్, హైదరాబాద్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని
ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

SNEHA MACS LTD Ph : 7660027682
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
స్నేహ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువుకు, పెళ్ళికోసం కానుకగా
5 సం.ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 12% వడ్డీ
గత 20 సం॥లుగా సమాజ మార్పు కోసం కంపెనీకి వచ్చే లాభాలను పేద ప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ SOCIAL ENGINEERING చేస్తున్నాం
H.NO. NO. 6-2-19/3/12, 3rd Floor, Doulat Plaza, Lakdikapool, Hyderabad, Telangana.
Email : snehamacsltd@gmail.com

స్నేహ పెండ్లిపిలుపు
స్నేహ మ్యారేజ్ బ్యూరో
వివరాలకు :
https://snehapellipilupu.com/
9154958315

SNEHA MACS LTD Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
Regd. No. TS/ DCO/HYD/MACS/2017?314 Dt 30th May 2017
స్నేహ పెన్షన్ స్కీమ్
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును
సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును
మీ డిపాజిట్ లభించే వడ్డీ
రూ. 1,00,000/- రూ. 11,000/-
రూ. 5,00,000/- రూ. 55,000/-
రూ. 10,00,000/- రూ. 1,10,000/-
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువకు, పెళ్ళికోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ.5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

# ఒక్కరోజు మురిపించి వదిలేశారు!

## పొదుపు రుణం స్వాహా..

ఆందోళనలో గిరిజన పొదుపు మహిళలు



తుగ్గలి, డిసెంబరు 7: పొదుపు రుణం స్వాహా చేశారంటూ గిరిజన మహిళలు ఆందోళనకు దిగారు. బుధవారం మండల పరిధిలోని గుడిసె గుప్పురాళ్లకు చెందిన చంద్రికా గ్రూపు సభ్యులు 13 మంది తుగ్గలి లోని వెలుగు కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. తమకు చదువు రాదని, ఇలా తీసుకోని రుణాలకు డబ్బు కట్టాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామైఖ్య సంఘం లీడర్లు నాగమ్మ, సరస్వతి మాట్లాడుతూ 2008లో రూ.1.50 లక్షలు చంద్రికా గ్రూపుపై రుణాలు తీసుకున్నారని అధికారులు చెబుతున్నారని, అయితే తాము 2004లో తప్ప ఎన్నడూ గ్రామైఖ్య సంఘం రుణాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. గిరిజనులు కాబట్టి రుణాలు మాఫీ అవుతాయని అధికారులే మా గ్రూపుపై రుణాలు తీసుకుని కాజేశారని, 15 సంవత్సరాలు గడిచిన తర్వాత రుణాలు చెల్లించాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లెడ్జర్ బుక్‌లో తమ సంతకాలు లేకుండా దొంగ సంతకాలు పెట్టి రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. దొంగ సంతకాలు పెట్టి రుణాలు తీసుకున్న వారిపై ఫోర్జరీ కేసు పెట్టి ఆ రుణాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరిం చారు. సీసీలు మాట్లాడుతూ రుణాలు తీసుకున్న సమయంలో తాము అక్కడ లేమని, తమకు విషయం తెలీదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు పాపమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

### పునరావాస కేంద్రంలో ఆకలి కేకలు
### ఆహారంపై చేతులెత్తేసిన అధికారులు
### పట్టించుకోలేదని వాపోయిన బాధితులు
### మూడు రోజులుగా నీటిలోనే నివాసాలు



ఒంగోలు, డిసెంబరు 7: మిచౌంగ్ తుఫాన్ ముప్పుపై మూడు రోజులు ముందు నుంచి అధికారులు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. ప్రయాణాలు చేయకూడదని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని ఆదేశించారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతకు మించి స్వయంగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్‌లు పునరావాస కేంద్రాన్ని సందర్శించి ముంపు బాధితులకు భరోసా ఇచ్చారు. అధైర్యపడొద్దని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీలు కూడా ఇచ్చారు. కానీ ఇదంతా ఒక్కరోజు మాత్రమే. తుఫాన్ ముప్పు దాటిపోగానే ఎవరి దారి వారు చూసుకున్నారు. నగరంలోని మంగమూరు రోడ్‌లోని సత్యసాయి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారిని బుధవారం ఎవరూ పట్టించుకోలేదు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఆకలితో అలమటించారు. మధ్యాహ్నం మూడు గంటలైనా అన్నం పెట్టేవారు లేకపోవడంతో పసిబిడ్డలతో తల్లడిల్లారు. తమ పరిస్థితి ఏమిటని స్థానిక సచివాలయం వీఆర్‌వోను ప్రశ్నించగా తానేమీ చేయలేనని, భోజనం పెట్టించడం తనవల్ల కాదంటూ ముఖం చాటేశారు. దీంతో సాయం చేసేవారి కోసం దీనంగా ఎదురుచూశారు. బాధితుల బాధను ఆంధ్రజ్యోతి తహసీల్దారు మురళిదృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ బాధ్యతలు నిర్వర్తించామని, రిలీఫ్ క్యాంపులను కూడా తీసేయడం జరిగిందని తెలిపారు. అయితేప్రభుత్వపరంగా వారికి ఒక్కో కుటుంబానికి ఆర్థిక సహాయం మంజూరైందని, వాటినిఅందజేస్తామని తెలిపారు.

**బాధితుల గోడు వట్టని యంత్రాంగం**

మూడు రోజులపాటు జిల్లాను వణికించిన మిచౌంగ్ తుఫాను నుంచి లోతట్టు ప్రాంతాల వారిని కాపాడేందుకు అధికారులు నగరంలో తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే చాలా కేంద్రాలకు ప్రజలు రావడానికి ఇష్టపడకపోగా, ఎవరి ఇళ్లలో వారే ఉన్నారు. అయితే 37వ డివిజన్ పరిధిలోని సంచార జీవనం సాగించే గంగిరెద్దుల కుటుంబాల వారు వందకుపైగా తాత్కాలిక గృహాలు ఏర్పాటు చేసుకున్నారు. 250 మందికిపైగా అక్కడ ఉంటున్నారు. అయితే మూడు రోజులపాటు కురిసిన వానకు వారి ఇళ్లన్నీ నీట మునగడంతో వస్తువులను అలాగే వదిలేసి, పసిబిడ్డలను చంకన పెట్టుకుని సత్యసాయి స్కూలులోని పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. అయితే మంగళవారం మంత్రి సురేష్ అక్కడకు విచ్చేయనుండటంతో అధికారులు నానా హడావుడి చేశారు. అవసరం ఉన్నా, లేకపోయినా, అడిగి మరీ అన్నం వడ్డించారు. ఏ లోటు లేకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. అయితే మంత్రి పర్యటన ముగియగానే అధికారులు ఎవరిదారి వారు చూసుకున్నారు. బుధవారం వర్షం తగ్గిపోవడంతో వారిని తిరిగి వారి ఇళ్లకు చేర్చకపోగా, కనీసం తిండీతిప్పలు కూడా పట్టించుకోలేదు. మూడు రోజులుగా వారి ఇళ్లన్నీ నీటిలోనే ఉన్నాయి. తిండి పెట్టకపోయినా ఫర్వాలేదు, కనీసం ఇళ్లలోకి వచ్చిన నీటిని మోటార్లతో తొలగించాలని బాధితులు వేడుకున్నారు.

# చెప్పం.. చేసేస్తాం..



పుంగనూరు :పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణానికి 2020 సెప్టెంబరు రెండో తేది ఉత్తర్వులు వచ్చాయి. ఒక టీఎంసీ సామర్థ్యంతో పది వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీటిని అందించేందుకు రూ.717.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ చేపట్టింది. ఈ రిజర్వాయరు వల్ల ఏటిగడ్డకమ్మపల్లె, ఇర్లవాండ్లపల్లె, దిగువకొండమీద ఇళ్లు, ఆరంట్లపల్లె, ఆవులవారిపల్లె, ఎర్రగుంట్లపల్లె, నేతిగుట్లపల్లె, దిగువ చింతలవారిపల్లె, పత్రపల్లె గ్రామాలకు చెందిన 150 మంది రైతులకు చెందిన 871 ఎకరాల భూమి, 19 వ్యవసాయ బోర్లు, ప్రాజెక్టు లోపుల ఉండే ఏటిగడ్డకమ్మపల్లె మునిగిపోతాయి. కానీ, ఈ బాధిత రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. వీరి పొలాలకు ఎంత పరిహారం.. ఎప్పుడు ఇస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామం, పొలాలకు నష్టపరిహారం ఇచ్చి పనులు చేయాలని ప్రారంభంలోనే వీరంతా అధికారులను కోరారు. మేము మీ పొలాల్లోకి వచ్చి పనులు చేయలేదని, మీ పొలాల్లో పనిచేసేలోపు పరిహారం వస్తుందంటూనే 80 శాతానికిపైగా పనులు చేసేశారు. రైతుల ఆందోళన... ఆవేదనను అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికీ పరిహారం, పునరావాసం గురించి హామీలు తప్ప పైసా కూడా నిర్వాసిత రైతులకు ప్రభుత్వం ఇవ్వలేదు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంచి ధరతో పరిహారం ఇవ్వడానికి కృషి చేస్తున్నారని అధికారులు చెప్పడం మినహా ఫలితంలేదు. రెండేళ్లుగా ముంపు రైతులు కాళ్లరిగేలా పుంగనూరు తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా ప్రభుత్వానికి నివేదికలు పంపాం, పదిరోజుల్లో పరిహారం ఇస్తామని చెప్పడం తప్ప వీరి గోడు పట్టించుకునే వారే కరువయ్యారు.

'ఆవులపల్లె'కు ప్రభుత్వ భూములు కాదని..

సోమల మండలం ఆవులపల్లె బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణంలోనూ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టింది. 3.50 టీఎంసీలతో 40 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు రూ.667.20 కోట్లు మంజూరు చేసింది. రిజర్వాయరు కోసం 1300 ఎకరాల భూమి అవసరం కాగా సమీపంలోని సర్వే నెంబరు 6లో ఉన్న 900 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మిస్తే భూసేకరణ వ్యయం తగ్గడమే కాక రైతులు, గ్రామాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు కలెక్టర్‌కు ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె గ్రామరైతులు అభ్యర్థించి ఆక్షేపణలు చేశారు. రైతులు సాగుచేస్తున్న వెయ్యి ఎకరాల్లోని లక్ష మామిడి చెట్లు, 10 వేల కొబ్బరి చెట్లు, 500 చింతచెట్లు, వెయ్యి జామ, అల్లనేరుడు, 500 సపోటా చెట్లతో పాటు టమోటా, బొప్పాయి, వరి, తదితర హార్టికల్చర్ పంటలు ముంపునకు గురవుతాయని వాపోయారు. పచ్చదనం నాశనమవుతుందని తెలిపారు. పెద్దదేవలకుప్పం, ఎస్టీ కాలనీ, చిన్నదేవలకుప్పం, బయ్యారెడ్డిపల్లె, రామకృష్ణాపురం గ్రామాలు మునిగి రైతులు, ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. వీరి ఆవేదనను పట్టించుకోకుండా అధికారులు తమ ప్రతిపాదనలతోనే పనులు చేయడానికి రంగంలోకి దిగారు. కనీసం ముంపు రైతులకు, గ్రామాల్లో ఇళ్లు, ఆస్తులు కోల్పోయేవారికి ఎంత ఆస్తి, చెట్లు, ఇళ్లు పోతాయని వాటికి ప్రభుత్వం పరిహారం ఎంత ఇస్తారనే విషయాలపైనా ఇంతవరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు.

నిలదీస్తే కేసులే

తమ భూములు ఇవ్వమని ఎదురు తిరిగిన.. నిలదీసిన పలువురు ముంపు రైతులపై పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో కేసులు బనాయిస్తున్నారు. 'ఆవులపల్లె సీతమ్మ చెరువులో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పాటు పీఎల్ఆర్ కంపెనీ మేనేజర్ తదితరులు సర్వే చేస్తున్నాం. ముంపు బాధిత రైతులు మాపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించారు. దుర్భాషలాడుతూ ఏఈ చెంపపై కొట్టారు' అంటూ ఇరిగేషన్ డీఈఈ ప్రసన్నకుమారి 2022 అక్టోబరు 10వతేది లక్ష్మీపతి నాయుడుతో పాటు మరికొందరు రైతులపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమల పోలీసులు కేసు నమోదు చేశారు. అదేరోజు పెద్దఉప్పరపల్లె దళితవాడకు చెందిన ఎన్.వెంకటస్వామి ప్రాజెక్టు వద్ద కొలతలకు కూలికి వెళ్లగా లక్ష్మీపతి నాయుడు మరికొందరు గొడవ చేసి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పలుచోట్ల హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు రైతులపై పెట్టి అరెస్టు చేశారు.

ఎన్జీటీ ఆదేశాలతో ఆగిన పనులు

'ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వ జీవోలకు, క్షేత్రస్థాయిలో పనులకు తేడాలున్నాయి. సరైన అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారు' అంటూ 2022 సెప్టెంబరు 30న సోమల మండలంలోని ముంపు గ్రామాలకు సంబంధించి గుత్తా గుణశేఖర్‌తో పాటు 13మంది రైతులు కేసు ఫైల్ చేశారు. ప్రాజెక్టులకు సంబంధించి జీవో నెంబర్లు 461, 444పై రైతులు అభ్యంతరాలు తెలిపారు. దీనిపై 2022 అక్టోబరు 12న ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్) కేసు నమోదు చేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా, పనుల్లో అతిక్రమణలు, తప్పుడు సమాచారంతో రూ.2,144 కోట్లతో చేపట్టిన నేతిగుట్లపల్లె, ఆవులపల్లె, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులు తక్షణమే ఆపేయాలని ఈ ఏడాది మే 11న ఎన్జీటీ తీర్పునిచ్చింది. దీంతో పనులు ఆగాయి.

# ఏపీకి సీఈసీ...!

విజయవాడ, డిసెంబర్ 7, :కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఆంధ్రప్రదేశ్ కు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఈనెల 22, 23 తేదీల్లో పర్యటించనున్నారు. ఓటర్ల జాబితా అక్రమాలపై ప్రతిపక్ష నేతల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఈ బృందం ప్రత్యేకంగా పరిశిలించనున్నట్లు తెలిసింది. దొంగ ఓట్ల పేరుతో అసలు ఓట్లను తొలగించారంటూ విపక్ష టీడీపీ పెద్దయెత్తున ఆరోపణలు చేసింది. ఆరోపణలు చేయడమే కాకుండా నేరుగా కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటికే దీనిపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈసీ అధికారులు తమ పర్యటనలో భాగంగా రాజకీయ పక్షాలను కలవడంతో పాటు ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఏపీలో ఓట్ల అక్రమాలపై సీఈసీకి చంద్రబాబు ఫిర్యాదు చేయనున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ చెందిన బృందం రాష్ట్రనికి చ్చే ముందే ఢిల్లీ వెళ్లి సీఈసీని కలవాలని చంద్రబాబు నిర్ణయించారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల పరిశీలకులు ఆయా నియోజకవర్గాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కేవలం సచివాలయంలో కూర్చొని ఓట్లు తొలగిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితాలో అవకతవకల అంశం రాజకీయం దుమారం రేపుతోంది. అధికార వైసీపీ నేతలే ఓటర్ల జాబితాలో టీడీపీ, జనసేన సానుభూతి పరుల ఓట్లు తొలగిస్తున్నారని తెలుగు దేశం పార్టీ, జనసేన ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై ఇరు పార్టీలు అటు ఎన్నికల కమిషన్‌తో పాటు, ఇటు జిల్లాల వారీగా కలెక్టర్లను కలిసి పిర్యాదులు చేస్తున్నారు. ఓట్ల తొలగింపు వ్యవహారంలో కొందరు అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో తప్పుడు ఓటర్ల జాబితా తయారు చేస్తున్నారని టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రజా సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలు ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అవకతవకలపై కూడా కలిసి పోరాటం చేయాలని నిర్ణయానికి వచ్చాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరిగిన అవతవకలను కేంద్రీకరించి వాటిని ప్రజల్లోకి వెళ్లి వివరించాలని భావిస్తున్నాయి. అందులో భాగంగా రెండు పార్టీలు నేతలు రాష్ట్రంలోని అన్ని నియజకవర్గాల్లోనూ ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలిస్తున్నారు. కొత్త ఓటర్ల చేరిక, పోలింగ్ బూత్‌ల మార్పు, ఓటర్ల డబల్ ఎంట్రీపై ప్రతి ఇంటికి వెళ్ళి పరిశీలించనున్నారు. అక్రమాలకు పాల్పడిన పలువు? అధికారులను ఇప్పటికే విధుల నుంచి తప్పించారు. ఇంకా అనేక మంది ఉద్యోగులు... అక్రమాల్లో బాధ్యులుగా ఉన్నారని.. వారు చేసిన అక్రమాలపై విచారణ చేయాలన్న డిమాండ్ టీడీపీ వినిపిస్తోంది. ఎన్నికల సంఘం అధికారులకూ అదే చెప్పనున్నారు.

## తగ్గిన వర్షాలు..

ఏలూరు:ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వానలు తగ్గుముఖం పటటాయి. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో పంట పోలాలు జలమయమైయాయి. గురువారం ఉదయం కుడా వరి పోలాలు, ధాన్యం రాశులు వర్షపు నీటిలోనే తెలియాడుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రకటించారు. తుఫాన్ కారణంగా జిల్లాలో సుమారు 23,661 హెక్టార్లలో పంట నష్టం కాగా, వివిధ మౌలిక వసతులు దెబ్బతినడం కారణంగా సుమారు రూ.188 కోట్లు నష్టం వాటిల్లింది. 19 మండలాల్లోని 113 గ్రామాలు తుఫాను కారణంగా ఏర్పడిన తీవ్ర వర్షాలు, ఈదురు గాలులు తాకిడికి గురయ్యాయి. 19 గ్రామాలలో, నాలుగు మున్సిపాలిటీ లోని కొన్ని ప్రాంతాల్లో నీరు చేరింది. 4,090 మంది ప్రజలు ప్రభావితం అయ్యారు. 26 గృహాలు పూర్తిగా దెబ్బతినగా 79 గృహాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. 423.53 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారులు దెబ్బతిన్నాయని ఆమె వెల్లడించారు.

## ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

బాపట్ల :బాపట్ల మండలం భర్తపూడిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియనువ్యక్తులు కూల్చివేసారు ఎన్టీఆర్ విగ్రహం తలభాగాన్ని తీసి నేలపై పడేసారు. విషయం తెలుసుకున్నటీడీపీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేసారురు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముందు జాగ్రత్తగా భర్తపూడి గ్రామంలో పోలీసు బలగాలు మొహరించారు.

### ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుని కలిసిన పట్టణ నూతన ఎస్సై ఆనంద్ కుమార్

జగ్గయ్యపేట డిసెంబర్ 7 ప్రజాపాలన ప్రతినిధి పట్టణ నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆనంద్ కుమార్ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అం దజేశారు



# పోలవరంపై కేంద్రం మండిపాటు



ఏలూరు, డిసెంబర్ 7,ంపోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ ప్రభుత్వం తీరుపై కేంద్రం మండిపడింది. ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వానికి సీరియస్‌నెస్ లేదని వ్యాఖ్యానించింది. వద్దన్నా నీరు నింపుతున్నారని, కాఫర్‌డ్యాం కొట్టుకుపోతే ఎవరు బాధ్యులని నిలదీసింది. మరో 15 రోజుల్లో తిరిగి సమావేశం కావాలని, అప్పటికి నిర్దేశించిన అంశాల్లో కొన్ని పూర్తిచేసుకుని రావాలని ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ అంశాలపై మంగళవారం కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కేంద్ర జలశక్తి మంత్రి సలహాదారు వెదిరె శ్రీరామ్ సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ తీరుపై దేబశ్రీ ముఖర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైడ్‌బండ్ కుంగడానికి బాధ్యత ఎవరిదో ఎందుకు నిర్ధారించలేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తిచేయాలనుకుంటున్నారో చెప్పాలంటూ ప్రశ్నించారు. 2024 జూన్ నాటికి పూర్తిచేయాలని తమ ఉద్దేశమని ఏపీ అధికారులు చెప్పారు. పోలవరం అంశాలపై ఆంధ్రప్రదేశ్ అధికారులకు ఎన్నిసార్లు లేఖ రాసినా స్పందన లేదని ప్రాజెక్టు అథారిటీ సీఈఓ శివనందన్ కుమార్ సమావేశంలో తెలిపారు. ప్రాజెక్టులో నీళ్లు ఖాళీచేయాలని తాము ఎన్నిసార్లు లేఖ రాసినా పట్టించుకోలేదని ఆయన తెలిపారు. ఇప్పటికే ఎగువ కాఫర్‌డ్యాం తీవ్ర సీపేజీ సమస్యతో కొట్టుకుపోయేలా ఉందని, కాఫర్‌డ్యాం కొట్టుకుపోతే ఎవరు బాధ్యులని అని దేబశ్రీ నిలదీశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని ఆమోదించే ప్రక్రియను కేంద్రం వేగవంతం చేసింది. తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.36 కోట్లుగా ఖరారు చేస్తూ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పంపిన ప్రతిపాదనను మదింపు చేసి సోమవారం కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇస్తామని రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్‌సీసీ) చైర్మన్ ఏఎస్ గోయల్ మంగళవారం తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏర్పాటైన ప్రాజెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఐబీ)కి కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదన పంపుతుంది. పీఐబీ ఆమోద ముద్ర వేస్తే సవరించిన అంచనా వ్యయం మేరకు పోలవరం తొలి దశ పనులకు తాజా ధరల మేరకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. సీడబ్ల్యూసీ ఆమోదించిన ప్రకారం పోలవరం ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.36 కోట్లని, ఇందులో రూ.16,119.56 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సభ్య కార్యదర్శి రఘురాం వివరించారు. ప్రాజెక్టులో రూ.15,505.80 కోట్ల విలువైన పనులు మిగిలాయని తెలిపారు. తొలి దశ పనులకు రూ.12,911.15 కోట్లు మంజూరు చేసేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అంగీకరించారని ఆ శాఖ ప్రధాన సలహాదారు రిచా మిశ్రా గుర్తు చేశారు. తొలి దశ పనుల పూర్తికి మంత్రి ఆమోదించిన వ్యయంకంటే అదనంగా రూ.2,594.65 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ తేల్చిందన్నారు. తొలి దశ పనులకు 2013?14 ధరల ప్రకారం ఎంత అవసరం, 2017?18 ధరల ప్రకారం ఎంత అవసరమన్నది మరింత విపులంగా శుక్రవారంలోగా నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని కోరారు.

## చెన్నై ఎంజీఆర్ మాల్ ను ప్రారంభించిన సినీ తార అనసూయ

రాజంపేట ప్రజాపాలన ప్రతినిధి : రాజంపేటలో సినీ తార అనసూయ భరద్వాజ్ సందడి చేశారు. సినీ తార అనసూయ చేతు ల మీదుగా రాజంపేట పాత బస్టాండు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నై ఎంజీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకే పాటి అమర్నాథరెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి బత్యాల చెంగల్రాయుడు టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్థి జగన్ మోహన్ రాజు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి లతోపాటు పలువురు వైసిపి టిడిపి నాయకులు హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం సినీ తార అనసూయ వేసిన పంచులతో . మెరిసిపోయింది.

## మిచాంగ్ తుఫాన్ తో నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

మచిలీపట్నం : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కరగ్రహారం, క్యాంబిల్ పేట, చిన్నకరగ్రహారం, పల్లిపాలెం, నవీన్ మిట్టల్ కాలనీ, మేకవాని పాలెం,తాళ్లపాలెం, మంగినపూడి, తుమ్మలచెరువు,పేద యాదర, చిన యాదర, భోగిరెడ్డిపల్లి,నెలకుర్రు చిన్నాపురం, గ్రామాలలో నీట మునిగి దెబ్బతిన్న వరి, వేరుశనగ, మినువు పంటలు ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడంతో మొత్తం పొలాలు నీళ్లతో నిండిపోయి, అమ్ముకోవడానికి వీలు కాకుండా కుళ్లిపోయి నష్టపోయిన రైతాంగాన్ని పరామర్శించి తక్షణమే అధికారులు స్పందించి రైతాంగానికి ఇన్సూరెన్స్ కింద ఆదుకోవాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.. వారితో పాటు మచిలీపట్నం నియోజకవర్గ రూరల్ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అలా ముందుకు...



విజయవాడ, డిసెంబర్ 7,:టీడీపీ అధినేత చంద్రబాబుతో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో పవన్ కల్యాణ్ సమావేశం అయ్యారు. పవన్ వెంట నాదెండ్ల మనోహర్ ఉన్నారు. ఏపీలో రాజకీయ పరిస్థితులు, ఉమ్మడి కార్యాచరణపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోపై నవంబర్ 4న చంద్రబాబు, పవన్ భేటీ అయిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఉమ్మడి మేనిఫెస్టోపై ఇరుపార్టీలు కసరత్తు చేస్తున్నాయి. తరచూ భేటీ అయి పొత్తును ముందుకు తీసుకెళ్లేలా ఇరువురు నేతల గతంలో నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇవాళ మరోసారి చంద్రబాబు, పవన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు.చంద్రబాబు మధ్యంతర బెయిల్ పై విడుదలైనప్పుడు పవన్ కల్యాణ్...వరుణ్ తేజ్ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లారు. దీంతో అప్పట్లో పవన్ చంద్రబాబును కలవలేకపోయారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు ఆయనతో భేటీ అయిన పవన్... పొత్తుపై సంచలన ప్రకటన చేశారు. చంద్రబాబు బెయిల్ పై విడుదలైన తర్వాత నవంబర్ 4న కలిసి పరామర్శించారు పవన్. తాజాగా ఇప్పుడు మరోసారి భేటీ అయిన పవన్, చంద్రబాబు...ఏపీ రాజకీయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. వచ్చే మార్చిలోనే సాధారణ ఎన్నికలు, ఏపీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందన్న సమాచారం.. టీడీపీ, జనసేన కూటమి చేపట్టాల్సిన ఉమ్మడి కార్యాచరణ, సీట్ల సర్దుబాటు, ఎన్నికల వ్యూహాలపై ఇరువురు చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు లోకేశ్ యువగళం పాదయాత్ర ముగింపు సభలో పవన్ పాల్గొనే విషయంలో ఈ భేటీ చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల తక్కువ సమయం ఉండడంతో... టీడీపీ, జనసేన ఉమ్మడిగా చేపట్టాల్సిన కార్యాచరణపై చంద్రబాబు, పవన్ చర్చించినట్లు తెలుస్తోంది.

# తిరుమలలో అన్నప్రసాదం ... విమర్శలు



తిరుమల, డిసెంబర్ 7,:తిరుమల తిరుపతి దేవస్థానం మరో వివాదంలో చిక్కుకుంది. టీటీడీ వెంగమాంబ అన్నదాన సత్రంలో నాసిరకం బియ్యంతో చేసిన ప్రసాదాలు పెట్టారని భక్తులు నిరసనకు దిగారు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. అన్నప్రసాద సముదాయంలో భక్తులకు వడ్డించే అన్నం ఉడకలేదంటూ కొందరు భక్తులు ఆరోపించారు. టీటీడీ సిబ్బందిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైరల్ గా మారిన వీడియోపై టీటీడీ స్పందించి, విచారణ చేపట్టి వివరణ ఇచ్చింది.తిరుమల పుణ్యక్షేత్రానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇలా వచ్చిన భక్తులు మహాప్రసాదంగా భావించి మాతృశ్రీ వెంగమాంబ అన్నదాన సత్రంలో భోజనం స్వీకరిస్తుంటారు. వెంగమాంబ అన్నదాన సత్రంలో మొత్తం నాలుగు హాల్స్ ఉండగా, ఒక దఫాలో దాదాపు 4 వేల మంది భోజనం (మహా ప్రసాదం) స్వీకరించే అవకాశం ఉంది. ఇలా ఒక్క రోజుకి మొత్తం నలభై వేలనుండి యాభై వేలమందికిపైగా భక్తులు ఇక్కడ అన్నప్రసాదం స్వీకరిస్తుంటారు. గత కొంత కాలంగా అన్నదానంపై అనేక విమర్శలు వస్తున్నాయి. గతంలో నాణ్యత లేని బియ్యంతో భక్తులకు అన్నం తయారు చేసి వడ్డిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. గత వారం కార్తీక దీపం రోజు అన్నదానంలో భుజించిన భక్తులు అన్నం సరిగ్గా లేదంటూ సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. ఏపీకి చెందిన దాదాపు 17 మంది భక్తబృందం అన్నదాన సత్రం మహాప్రసాదం స్వీకరించేందుకు వెళ్ళిన సమయంలో అన్నం సరిగ్గా ఉడకకుండానే భక్తులకు వడ్డించేస్తారా అంటూ భక్తులు నిరసన తెలిపారు. అక్కడే ఉన్న టీటీడీ సిబ్బందిని చొక్కా పట్టుకుని నిలదీసి టీటీడీ ఉన్నతాధికారులు వచ్చి వెంటనే సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ ఒక్కసారికి వదిలేయమంటూ పొరపాటు జరిగిందని వదిలేయమంటూ భక్తులను సిబ్బంది వేడుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఓ రాజకీయ పార్టీ ఈ వీడియోను పోస్టు చేసింది. ఇప్పటికే ఈ ఘటనపై టీటీడీ డిప్యూటీ ఈవో రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతుంది. ఇందుకు గల కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని చెప్పారు.మహాప్రసాదం (భోజనం) సరిగాలేదని వీడియో వైరల్ కావడంపై టీటీడీ స్పందించింది. ఇది కేవలం రాజకీయ కోణంలో కొందరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని టీటీడీ కొట్టి పడేసింది. అన్నప్రసాదంలో నాణ్యత లోపంపై టీటీడీ ఛైర్మెన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. కొందరు భక్తులు అన్నప్రసాదం బాగాలేదని చెప్పడం తమ దృష్టికి వచ్చిందని, బియ్యంలో నాణ్యత లోపంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అన్నప్రసాదం మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇలాంటిది జరగలేదన్నారు. అదే సమయంలో మరో 700 మంది భక్తులు అన్నప్రసాదాని స్వీకరించారని, ఆ భక్తులకు లేని ఇబ్బంది మిగిలిన భక్తులకు ఎందుకు కలిగిందో అర్థం కావడం లేదన్నారు. ఇతర భక్తులను కొంత మంది రెచ్చగొట్టడం, అక్కడ పని చేసే సిబ్బంది తాగుబోతులని ఆరోపించడం బాధాకరం అన్నారు. రాజకీయ కోణంలో అన్నదాన సత్రంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని భూమన చెప్పారు.

# 11.6 లక్షల ఎకరాల అసైన్డ్ ల్యాండ్ లకు రికార్డులు లేవు..!

రాజమండ్రి, డిసెంబర్ 7,:భూమిలేని పేదలకు దశాబ్దాల కాలంగా అనేక ప్రభుత్వాలు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో రాష్ట్ర వ్యాప్తంగా 11.61 లక్షల ఎకరాలకు సరైన రికార్డులు లేవని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో కేవలం 11,266 ఎకరాల భూములు నీటివనరుల (వాటర్‌బాడీ) కింద ఉన్నాయి. ఇదిలా ఉంటే మిగిలిన భూములకు యజమానులు వీరేననే నిర్ధారించేందుకు సరిపడా రికార్డులు లేవని ప్రభుత్వం పేర్కొంటుండటం వ్యూహాత్మకమేనా అనే చర్చ నడుస్తోంది. ఆ సాకుతో గ్రామ స్థాయిలోని పెత్తందారులు, రాజకీయ నాయకులు, బడా బాబులకు ఆయా భూములను సులభంగా కట్టబెట్టేందుకే ఈ ప్రయత్నమని అంటున్నారు. అసైన్డ్ ల్యాండ్స్ పంపిణీ చేసి 20 ఏళ్లు దాటినా నిజమైన లబ్ధిదారులకు ఆయా భూములకు సంబంధించి భూ యాజయాన్య హక్కులు కల్పించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) యాక్ట్-1977కు ప్రభుత్వం సవరణలు చేసింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో ఇప్పటి వరకు 10.58 లక్షల ఎకరాల భూములకు యాక్ట్ నెంబరు 35 ఆఫ్ 2023 ప్రకారం ఆయా భూ యజమానులకు భూ యాజమాన్య హక్కులకు సంబంధించి పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమం ఒకవైపు




నడుస్తోంది.ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ (యాజమాన్య హక్కు) ఇవ్వడానికి ఇకెవైసి వద్ధతిని ప్రభుత్వం అవలంభిస్తోంది. ఇందుకు సంబంధించిన భూములను వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసేందుకు గ్రామ రెవెన్యూ అధికారులు భూ యజమానిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. తొలుత విఆర్‌ఒ, అనంతరం తహశీల్దార్, ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ ద్వారా ఆయా సర్వే నెంబర్లకు సంబంధించిన ఫైలు అప్రూవల్ అయిన అనంతరం 22(ఎ) నుంచి తొలగించడానికి జిల్లా రిజిస్ట్రార్‌లకు పంపించడం జరుగుతుంది. ఇటీవల జరిగిన రెవెన్యూ వర్క్‌షాపులో తీసుకున్న నిర్ణయం ప్రకారం రీ వెరిఫికేషన్ కోసం విఆర్‌ఒ లాగిన్‌లోకి ఆయా భూముల వివరాలు పంపుతున్నట్లు కలెక్టర్లకు నాడు పంపిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.అసైన్డ్ భూమిగా నమోదు చేయబడిన సందర్భాల్లో పట్టాదారు కాలమ్‌లో 'మిగులు భూమి', 'ప్రభుత్వ భూమి', తెలియనది, 'క్లెయిమ్ చేయని భూమి' పట్టాదారు అసైన్డ్ భూములు, ఎడబ్ల్యుడి భూములు లేదా ఏదైనా ఇతర వ్యక్తీకరణ (పట్టాదారు పేరు కాకుండా) ఉన్న భూములు 2023 చట్టం 35 ప్రకారం అసైన్డ్ చేయబడి, అర్హత కలిగి ఉన్నయో లేదో తనిఖీ చేయడానికి తిరిగి ధ్రువీకరించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. విఆర్‌ఒలు ధ్రువీకరించిన భూములను ఎలక్ట్రానిక్ రెవెన్యూ (వెబ్‌ల్యాండ్) రికార్డుల్లో పట్టాదారు పేరును చేర్చడానికి సదుపాయం కల్పించవచ్చని ప్రభుత్వం పేర్కొంది. కర్నూలు జిల్లాలో కొన్ని అసైన్డ్ భూములు ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డుల్లో ప్రభుత్వ భూమి 'కేటాయించలేదు' అని నమోదు చేసినట్లు గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆయా భూములకు నిజమైన యజమానులు ఎవరనే అంశాన్ని గుర్తించేందుకు విఆర్‌ఒ లాగిన్‌లోకి పంపడం జరిగిందని సమాచారం. ఇక్కడే పెద్ద ఎత్తున రాజకీయ నాయకుల ఒత్తిడులతో భూములు చేతులు మారే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడులు అధికంగా ఉంటాయనే చర్చ నడుస్తోంది.చుక్కల భూములను ప్రభుత్వం నాలుగు రకాలుగా వర్గీకరించింది. 22(ఎ)(1)(ఎ),(బి), (సి),(డి), అండ్ (ఇ) కింద నిషేధించబడిన జాబితాలో పొందుపరిచారు. వీటిలో షరతుల గల పట్టా భూములు, ప్రభుత్వ భూములు/లంక భూములు కొత్త అసైన్‌మెంట్, గ్రామ సేవా ఇనామ్‌లు భూములను నిషేధిత భూముల జాబితాలో తొలగించి వెబ్ ల్యాండ్ సవరణ చేయవచ్చని సూచించారు.


# భారీ ప్రక్షాళన దిశగా జగన్

నెల్లూరు, డిసెంబర్ 7,ఏపీ సీఎం జగన్ భారీ ప్రక్షాళనకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ దెబ్బ తినడంతో జగన్ సైతం ముందస్తు చర్యలు చేపడుతున్నారు. కెసిఆర్, జగన్ ఒకటే నన్న భావన ప్రజల్లో ఉంది. గత నాలుగున్నర సంవత్సరాలుగా కేసీఆర్ జగన్ అనుసరించారని ఏపీలోవిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అటువంటి కెసిఆర్ ఓటమితో జగన్లో అంతర్మథనం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. కెసిఆర్ విషయంలో జరిగిన తప్పులు.. ఏపీలో తన విషయంలో జరగకూడదని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే కొంతమంది నాయకులను వదులుకొని కొత్తవారికి టిక్కెట్ ఇవ్వాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి తెలంగాణలో సంక్షేమ పథకాలతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. సంక్షేమంతో పాటు అభివృద్ధిని కేసీఆర్



ప్రాధాన్యం ఇచ్చారు.కానీ ఆయనకు ఓటమి తప్పలేదు. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలపై వ్యతిరేకతబీఆర్ఎస్ కొంపముంచినట్లు తెలుస్తోంది. సీఎంగా తెలంగాణ ప్రజలు కేసీఆర్ కు మంచి మార్కులే వేసినా.. దిగువ స్థాయిలో ఎమ్మెల్యేలతో పాటు పార్టీ క్యాడర్ చేసిన పనులే ఓటమికి కారణమని తేలింది. అయితే తెలంగాణతోపోల్చుకుంటే అంతకుమించిన స్థాయిలో ప్రభుత్వం పై వ్యతిరేకత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే జగన్కు ప్రమాదం తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.ప్రజలకు నేరుగా నగదు పంచుతున్నారు.వారి ఆర్థిక జీవన ప్రమాణాలు పెంచుతున్నట్లు భావిస్తున్నారు. కానీ ఎటువంటి అభివృద్ధి లేదని, విధ్వంసకర పాలన కొనసాగుతోందని జగన్ సర్కార్ పై ఒక రకమైన విమర్శ ఉంది. ఆయన తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నట్లు తేలుతోంది. ఇటువంటి సమయంలో జాగ్రత్త తీసుకోకుంటే ఘోర పరాజయం తప్పదని కొన్ని రకాల నివేదికలు చెబుతున్నాయి. ఈ తరుణంలో జగన్ క్షేత్రస్థాయిలో సర్వేలు, నివేదికలు తెప్పించుకుంటున్నారు. అత్యంత ఘోరంగా పనితీరు ఉన్న ప్రజాప్రతినిధులను పక్కన పెట్టే యోచనలో ఉన్నారు. ఇకనుంచి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలను పిలిచి కరాకండిగా తేల్చేయాలని జగన్ భావిస్తున్నారు. పనితీరు బాగాలేని ఎమ్మెల్యేలను పక్కన పెట్టాలని చూస్తున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే మరోసారి అవకాశం కల్పిస్తామని.. నామినేటెడ్ పదవి ఇస్తామని వారిని ఒప్పిస్తున్నారు. అదే సమయంలో వెనుకబడిన ఎమ్మెల్యేల కు ప్రత్యామ్నాయంగా కొంతమంది నేతలను గుర్తిస్తున్నారు. వారికే టికెట్ కేటాయించేందుకుని ద్ధపడుతున్నారు.

## లేటెస్ట్..హృతిక్ "ఫైటర్" టీజర్ డేట్ ఫిక్స్..!




బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ హీరోగా దీపికా పదుకోన్ హీరోయిన్ గా బాలీవుడ్ యాక్షన్ సినిమాల స్పెషలిస్ట్ దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్న మరో భారీ చిత్రమే "ఫైటర్". మరి దీని నుంచి కూడా మంచి హైప్ నెలకొనగా ఈ చిత్రం రీసెంట్ గానే ఈ చిత్రం నుంచి మేకర్స్ ఒకో స్టార్ నటుడు ఫస్ట్ లుక్ పోస్టర్స్ ని కూడా రిలీజ్ చేశారు. ఇక ఇప్పుడు అయితే ఫ్యాన్స్ కి సాలిడ్ అప్డేట్ వచ్చేసింది.దీనితో ఈ చిత్రం నుంచి అవైటెడ్ టీజర్ లాంచ్ కి ఇపుడు మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు. దీనితో ఈ టీజర్ రేపే అంటే డిసెంబర్ 8నే రిలీజ్ చేస్తున్నట్టుగా ఇప్పుడు కన్ఫర్మ్ అయ్యింది. దీనితో ఈ సినిమా టీజర్ పట్ల ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది. సిద్ధార్థ్ సరికొత్త యాక్షన్ సీక్వెన్స్ లతో హాలీవుడ్ లెవెల్ లో ట్రీట్ ఇస్తాడు. లాస్ట్ టైం వార్, పఠాన్ చిత్రాల్లో కూడా తన మార్క్ చూపించాడు. మరి ఈ సినిమాకి ఎలా ఉంటుందో చూడాలి.

## చైతు "తండేల్" నుంచి సాలిడ్ ట్రీట్ రాబోతోందా?



అక్కినేని వారి యంగ్ అండ్ ఫైనెస్ట్ హీరో అక్కినేని నాగ చైతన్య మెయిన్ లీడ్ లో నటించిన లేటెస్ట్ వెబ్ సిరీస్ "దూత" కి సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. దీనితో ఈ ఏడాదిలో మంచి కం బ్యాక్ ను అలాగే ఓటిటి డెబ్యూలో కూడా సాలిడ్ స్టార్ట్ ని ఇచ్చిన చైతు దీని తర్వాత తన కెరీర్ లో భారీ చిత్రం "తండేల్" ని అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే.టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్ చందూ మొండేటి తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ చిత్రం నుంచి నెక్స్ట్ మరో సాలిడ్ ట్రీట్ రాబోతున్నట్టు ఇప్పుడు బజ్ వినిపిస్తుంది. మేకర్స్ అయితే అతి త్వరలోనే ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని వదిలే ప్లాన్ లో ఉన్నారని తెలుస్తుంది. ఇప్పటికే దీనికి సంబంధించి షూట్ కూడా కంప్లీట్ చేసారని టాక్. మరి ఈ ఊహించని ట్రీట్ పై మరిన్ని డీటెయిల్స్ బయటకి రావాల్సి ఉంది.

## ఏజెంట్ కథ రాసిన రైటర్ ఏమన్నారంటే?



సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' మూవీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్ అందుకుందో తెలిసిందే. అఖిల్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవెల్ లో రూపొందిన ఈ సినిమా భారీ అంచనాల నడుమ విడుదలై డిజాస్టర్ గా నిలిచింది. నిర్మాతకి భారీ నష్టాలను మిగిల్చడమే కాకుండా డైరెక్టర్ సురేందర్ రెడ్డి, రైటర్ వక్కంతం వంశీ పై కూడా ఎన్నో విమర్శలు వచ్చాయి. ఏజెంట్ కోసం అఖిల్ చాలా కష్టపడ్డాడు.అఖిల్ కి ఏజెంట్ తో కెరియర్ లోనే కోలుకోలేని దెబ్బ పడింది. ఆ రేంజ్ లో ఏజెంట్ డిసప్పాయింట్ చేసింది. ఈ మూవీకి ప్రముఖ రచయిత వక్కంతం వంశీ కథ అందించారు. కిక్, రేసుగుర్రం, టెంపర్ వంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు కథ అందించిన వక్కంతం వంశీ ఏజెంట్ కథ రాశారంటే చాలామంది ఇది నమ్మలేకపోయారు. అయితే తాజాగా ఇదే విషయంపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు వక్కంతం వంశీ. ఈయన దర్శకత్వంలో నితిన్ హీరోగా 'ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్' సినిమా తెరకెక్కిన విషయం తెలిసిందే. డిసెంబర్ 8న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వక్కంతం వంశీకి ఏజెంట్ గురించిన ప్రశ్న ఎదురయ్యింది. రీసెంట్ గా ఏజెంట్ మూవీకి మీరు రైటర్ గా వర్క్ చేశారు. తెరమీద చూసిన కథ మొత్తం మీదేనా? అని అడిగిన ప్రశ్నకు.. సినిమా రిలీజ్ అయినప్పుడు నేను షూటింగ్ లో ఉన్నా. టీజర్, ట్రైలర్ తప్ప ఇప్పటివరకు సినిమా చూడలేదు. ఓటీటీలో వస్తే చూద్దాం అనుకుంటే అది ఇంకా ఓటీటీలో రాలేదు. నా లైఫ్ లో నేను థియేటర్లో చూడని నా ఏకైక కథ అదే. నేను స్వయంగా కథ రాసిన సినిమాను థియేటర్లో చూడలేకుండా అయిపోయానని ఇప్పటికీ సురేందర్ రెడ్డికి చెబుతూ జోకులు వేస్తుంటా'' అంటూ వక్కంతం వంశీ చెప్పుకొచ్చారు. దీంతో ఈయన చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. వక్కంతం వంశీ కామెంట్స్ పై పలువురు నెటిజన్స్ రియాక్ట్ అవుతూ వంశీ అబద్ధం చెబుతున్నారని, తాను తప్పించుకోవడానికే అలా అంటున్నారని రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

## 'యానిమల్' జోష్ తో శ్రీవల్లి జోరు!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఖాతాలో 'యానిమల్' రూపంలో మరో విజయం పడింది. ఈసారి బాలీవుడ్ లో ఈ అమ్మడు సక్సెస్ దక్కించుకోవడం చాలా ప్రత్యేకమైన విషయంగా చెప్పుకోవాలి. హిందీలో ఇప్పటి వరకు రష్మిక మందన్న గుడ్ బై మరియు మిషన్ మజ్ను సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు కూడా ఆమెకు నిరాశనే మిగిల్చాయి. బాలీవుడ్ లో ఎట్టకేలకు యానిమల్ సినిమాతో సాలిడ్ సక్సెస్ ను అందుకుని బోనీ కొట్టిన ఈ అమ్మడు సౌత్ లో కూడా జోరు కంటిన్యూ చేస్తుంది. యానిమల్ ఇచ్చిన జోష్ తో మరింత స్పీడ్ గా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ప్రస్తుతం పుష్ప 2 వంటి ప్రతిష్టాత్మక భారీ చిత్రంలో అల్లు అర్జున్ కి జోడీగా శ్రీవల్లి పాత్రలో రష్మిక మందన్న నటిస్తున్న విషయం తెల్సిందే. సుకుమార్ నుంచి పర్మీషన్ తీసుకుని మరీ తాను కొత్త సినిమాలకు కమిట్ అవుతున్నట్లుగా ఆ మధ్య ఒక చిట్ చాట్ లో రష్మిక పేర్కొంది. అందులో భాగంగా రష్మిక తాజాగా గర్ల్ ఫ్రెండ్ అనే సినిమాను రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో మొదలు పెట్టింది. తాజాగా షూటింగ్ షురూ అయింది. ఇక రెయిన్ బో అనే చిత్రంలో కూడా రష్మిక నటిస్తున్నట్లుగా అధికారిక ప్రకటన వచ్చింది. ఆ సినిమా షూటింగ్ గురించి క్లారిటీ రావాల్సి ఉంది. ఈ మూడు సినిమాలే కాకుండా నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో కూడా రష్మిక మందన్న నటిస్తున్నట్లు అధికారిక ప్రకటన వచ్చింది. భీష్మ సినిమా కాంబినేషన్ లో సినిమా అంటూ ఆ మధ్య ఒక వీడియోను కూడా విడుదల చేసి మైత్రి మూవీ మేకర్స్ వారు అధికారికంగా ఆ సినిమా ను ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఆ సినిమాకు సంబంధించిన అప్డేట్ లేదు. త్వరలోనే ఆ సినిమా షూటింగ్ లో రష్మిక పాల్గొంటుందేమో చూడాలి. మొత్తానికి నేషనల్ క్రష్ శ్రీవల్లి రష్మిక మందన్న జోరు మామూలుగా లేదనే చెప్పాలి.

## 240 దేశాల్లో..38 భాషల్లో సబ్ టైటిల్స్ తో!



ఓటీటీ అందుబాటులోకి వచ్చాక సినిమా కంటెంట్ కి హద్దులనేవి పూర్తిగా చెరిగి పోయాయి. దేశాలు.. ఖండాలు దాటిపోతున్నాయి. ప్రపంచ భాషల్లో సినిమా అందుబాటులో ఉంటుంది. ఏ భాషలో కావాలంటే ఆ భాషలో సబ్ టైటిల్స్ రూపంలో ఎంటర్ టైగన్ మెంట్ దొరుకుతుంది. తాజాగా ఇటీవలే నాగచైతన్య నటించిన దూత వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ లో రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన సస్పెన్స్ థ్రిల్లర్ కి మంచి రెస్పాన్స్ వస్తోంది.ఎన్ని భాషల్లో అందుబాటులో ఉందో? తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఓ తెలుగు వెబ్ సిరీస్ ఇన్ని భాష ల్లో అడుతుందా? అని సర్ ప్రైజ్ అవ్వడం ఖాయం. ఈ విషయాన్ని నిర్మాత శరత్ మరార్ రివీల్ చేసారు. 240 దేశాల్లో..38 భాషల్లో సబ్ టైటిల్స్ తో సిరీస్ ప్రదర్శితమవుతోంది. ఇన్ని దేశాల్లో..ఇన్ని భాషల్లో ఓ తెలుగు సిరీస్ రిలీజ్ కావడం ఇదే తొలిసారి కావొచ్చు. ఇప్పటివరకూ టాలీవుడ్ నుంచి కూడా చాలా వెబ్ సిరీస్ లు రూపొందాయి. కానీ ఈ రేంజ్ లో ఏ సిరీస్ మార్కెట్ లోకి రాలేదు. బాలీవుడ్ వెబ్ సిరీస్ లకు దీటుగా దీన్ని రిలీజ్ చేసారు.

నాగ చైతన్యలో కొత్త నటుడ్ని పరిచయం చేసిన సిరీస్ ఇది అనొచ్చు. ఇంతవరకూ చైతన్య ఇలాంటి పాత్రలో ఏ సినిమాలో పోషించలేదు. ఆయన పూర్తిగా ఇమేజ్ చట్రం నుంచి బయటకు వచ్చి చేసిన వెబ్ సిరీస్ ఇది. కేవలం విక్రమ్. కె. కుమార్ పై నమ్మకంతోనే ధైర్యంగా రంగంలోకి దిగాడు. ఈ సిరీస్ చూసిన తర్వాత నాగార్జున కూడా థ్రిల్ ఫీలయ్యారు. ఇందులో నటించింది చైతన్యేనా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేసారు.



## నాని అంత చొరవ తీసుకుంటాడా?



ముక్కు..ముఖం తెలియని వారితో మూవ్ అవ్వడం అన్నది అంత ఈజీ కాదు. అలా మూవ్ అవ్వాల న్నా..అలాంటి వారితో స్నేహం చేసేలా ఉండాలన్నా కొన్ని ప్రత్యేక లక్షణాలనేవి ఉండాలి. రిజర్వ్డ్ గా ఉండే వాళ్లకిది అస్సలు సాధ్యం కాదు. కానీ నేచురల్ స్టార్ నాని మాత్రం ఆ టైపు కాదు అంటున్నాడు. ఆన్ సెట్స్ లోనూ కాదు ఆఫ్ ది సెట్స్ లోనూ నాని ఎంతో జోవియల్ పర్సన్ అని తెలుస్తోంది. ఇప్పటికే నానితో పనిచేసిన హీరోయిన్లు అంతా నాని ఎంత సరదాగా ఉంటాడో రివీల్ చేసిన సందర్భాలెన్నో. నాని సినిమాలో హీరోయిన్లు అంటే అతని ఇంట్లో మనుషుల్లా మారిపోతారు. తాజాగా నానిలో మరో రేర్ క్వాలిటీని కూడా బయట పెట్టాడు. ఎయిర్ పోర్టులో....ప్రయాణాల్లో పెద్దవాళ్లు పిల్లలతో ఇబ్బంది పడుతుంటే? కాసేపు నేను చూసుకుంటాను..ఇటు ఇవ్వండని చిన్న పిల్లలను తన చేతుల్లోకి తీసుకుని జోల పాడుతుంటాడుట.నేను మాట్లాడాక పెద్ద వాళ్లలోనూ ఇతడు మనవాడే అన్న అభిప్రాయం కలుగుతుంది. 'జెర్సీ'లోనూ..'హాయ్ నాన్న' లోనూ చిన్న పిల్లలతో కలిసి నటించా. చాలా సరదాగా అనిపించింది. మా అబ్బాయి జున్ను నన్ను నాన్న అని పిలుస్తుంటాడు. తను నాతో ఇంగ్లీష్ మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటే అస్సలు వినను. ఆ తర్వాత వాడే అర్ధం చేసుకుని తెలుగులో మాట్లాడుతుంటాడు' అని అన్నారు.ఒకప్పుడు మహేష్ ఎంతో రిజర్వ్డ్ గా ఉండేవారు. పిల్లల ఏడుపు శబ్దం వినిపిస్తేనే అసౌకర్యంగా ఫీలైనట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. మహేష్ జీవితంలో పెళ్లి..పిల్లలు రావడంతో ఆయనలో ఆ రిజర్వ్డ్ నెస్ పోయింది. ఇప్పుడింకా అందరితో చనువుగా మెలుగుతున్నారు. సెట్స్ లో అందరితో జోకులు వేయడం...సరదాగా సెటైర్లు వేయడం..స్టేజ్ లపై డాన్సులు చేయడం ఇలా మహేష్ చాలా మార్పులన్నీ మధ్యలో వచ్చినవే.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.